విశాఖపట్టణం
గురువారం 30 జులై 2026

For a pure tomorrow..

# జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:187 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## ఇక డీమార్ట్ మెడికల్ షాపులు

2

**20 శాతం వరకు డిస్కౌంట్**

**పైలట్ ప్రాజెక్టుగా ఫార్మసీ కౌంటర్లు**

**త్వరలోనే దేశవ్యాప్తంగా స్టోర్స్**

## అరుదైన వృక్షజాతికి పవన్ నామకరణం

**యూఫోర్బియేసీ కొత్త జాతికి క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ గా పేరు**

**జీవ వైవిధ్యానికి కూటమి కట్టుబడి ఉంది**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**




# వ్యవస్థలని నాశనం చేయడమే జగన్ లక్ష్యం

**చట్టాలంటే గౌరవం లేదు**

**హత్య కేసులో సీదిరికి పరామర్శ తగునా**


**పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు**





(అమరావతి - జయజయహే)

వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ వ్యవస్థల్ని నాశనం చేయటమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ అధినేత ఉన్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై వారు చర్చించారు. శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించనున్నారనే విషయాన్ని సీఎం దృష్టికి పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. వ్యవస్థల నిర్మాణం చేసే వాళ్లు చట్టాలను గౌరవిస్తూ వాటికి లోబడి నడుచుకుంటారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కానీ గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదన్నారు. గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలు తారుమారు చేసి ఇంకొకరి జీవితాన్ని బలి చేద్దామనుకున్న వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఏం మెసేజ్ ఇస్తారంటూ వైసీపీ అధినేత తీరును ఎండగట్టారు. గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం అతడిని ఆసుపత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదని అన్నారు. పుట్టిన రోజులకు గొడ్డళ్లతో జంతు బలులు చేసి రాక్షసానందం పొందే హింస ప్రవృత్తి ఆ పార్టీదని ఆయన అభివర్ణించారు. నేరాల నియంత్రణకు 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే 2019-24 మధ్య వాటికి మెయింటైనెన్స్ లేకపోవడంతో అవి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ..మిగతా 2లో




## యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణకు ఆమోదం


**బిల్లును జేపీసికి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్**

**గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. అంతకుముందు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న ..మిగతా 2లో

# కూటమిలో పదవుల పంట



**వచ్చే మూడేళ్లలో 30 ఎమ్మెల్సీలు**

**గవర్నర్, ఎమ్మెల్యే కోటాలో ఆధిపత్యం**

**ఆశావహులందరికీ అవకాశాలు**

**రాజకీయ వర్గాల్లో కీలక సమీకరణాలు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాజకీయం ప్రస్తుతం శాసనమండలి నామినేటెడ్ స్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో దాదాపు ఇరవై మందికి పైగా సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడుతుండటం అమరావతి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఖాళీ అయిన రెండు స్థానాల కోసమే క్యూలో నిలబడి అసంతృప్తికి లోనుకావాల్సిన అవసరం లేదని, కాస్త ఓపిక పడితే ఆశావహులందరికీ పదవులు దక్కడం ఖాయమని సమగ్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని 164 స్థానాల బలం ఆధారంగా రాబోయే మూడేళ్లలో మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సీట్లు కూడా ఏకపక్షంగా కూటమి ఖాతాలోనే పడనున్నాయి. శాసనమండలిలోని మొత్తం 58 స్థానాలు ఉన్నాయి. 2026 నుంచి మార్చి 2029 ..మిగతా 2లో



## ఇక జాబ్స్ జాతర..

**సెప్టెంబర్ నుంచి వరుసగా నోటిఫికేషన్లు**

**మొత్తం నాలుగు నోటిఫికేషన్ల తో ఉద్యోగాల భర్తీ**

**రెండో దశలో 3, 168, మూడో దశలో 2, 388 పోస్టులు**

**జాబ్ క్యాలెండర్ -2026 అమలుపై మంత్రి లోకేశ్ సమీక్ష**

(అమరావతి - జయజయహే)

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జాబ్ క్యాలెండర్-2026 అమలుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి ..మిగతా 2లో

## పెదపెంకి రోడ్డు పనుల్లో ప్రమాణాలకు తిలోదకాలు

**నాణ్యతా లోపాలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం**

**క్వాలిటీ కంట్రోల్ నివేదిక తర్వాత చర్యలు**

**బిల్లులు చెల్లింపులు నిలిపివేయాలని ఆదేశం**

(అమరావతి - జయజయహే)

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని సిమెంట్



## పనితనం జగన్‌ది.. ప్రచారం చంద్రబాబుది



**భోగాపురం ఎయిర్‌పోర్టుకు జగన్ భూమిపూజ**

**ఫైనాన్షియల్ క్లోజర్ కూడా పూర్తయ్యాకే శంకుస్థాపన**

**రూ.1200 కోట్లతో భూసేకరణ, పరిహారం**

**భోగాపురం--విశాఖ కనెక్టివిటీ రోడ్డుపై చంద్రబాబు వైఫల్యం**

**ప్రైవేట్ పెట్టుబడితో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం**

**అయినా తానే కట్టినట్లు చంద్రబాబు అసత్య ప్రచారం**

**మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆక్షేపణ**

(విశాఖపట్నం - జయజయహే)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం సంపూర్ణంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ కృషి, పట్టుదల వల్లనే సాధ్యమైందని, ఇందులో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ..మిగతా 2లో

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణరెడ్డికి రిమాండ్

**చంచల్ గూడ జైలుకు తరలింపు**

**ఉదయ్ క్యాష్ పిటీషన్‌పై హైకోర్టులో కీలక వాదనలు**

2


## విశాఖ ఎయిర్ పోర్టుకు గుడ్ బై

**ఆగస్టు 17 నుంచి సేవల్ బంద్**

**ఇక భోగాపురం ఎయిర్ పోర్టు నుంచే రాకపోకలు**

(విశాఖపట్నం - జయజయహే)

ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం కానుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఆగస్టు 17 ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహో

# పనితనం జగన్‌ది.. ప్రచారం చంద్రబాబుది

**మొదటి పేజీ తరువాయి...**

చేసిందేమీ లేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభించడాన్ని వైయస్సార్‌సీపీ స్వాగతిస్తోందన్న ఆయన, ఇతరులు చేసిన అభివృద్ధి పనులను తన ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ కొట్టేయాలని చంద్రబాబు చూడటం సరైంది కాదని హితవు పలికారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తూ బడ్జెట్ నిధులన్నింటినీ ఒకే ప్రాంతానికి ఖర్చు చేస్తే, మళ్లీ ప్రాంతీయ అసమానతలు, ప్రత్యేక ఉద్యమాలు తలెత్తే ప్రమాదముందని విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ధర్మాన ప్రసాదరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**జగన్ హయాంలోనే ఎయిర్‌పోర్టు కార్యరూపం:**

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల అభివృద్ధి కోసం భోగాపురం ఎయిర్ పోర్టుకు 2023 మే 3వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ శంకుస్థాపన చేశారు. ఫౌండేషన్ స్టోన్ వేసిన రోజే ఆయన చాలా స్పష్టంగా 2026, జూన్ చివరి నాటికి కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభమవుతాయని చెప్పారు. ఆయన అంత ధైర్యంగా ఎలా చెప్పగలిగారంటే, శంకుస్థాపన నాటికే ఎయిర్ పోర్టుకు కావలసిన భూసేకరణ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల ఎన్‌ఓసిలు, కన్సెషన్ అగ్రిమెంట్, నీరు, విద్యుత్ సదుపాయాలు పూర్తి చేశారు. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రైవేట్ డెవలపర్ బ్యాంకుల నుంచి రుణం పొందే 'ఫైనాన్షియల్ క్లోజర్' ప్రక్రియను పూర్తి చేయించిన తర్వాతే జగన్‌గారు పునాదిరాయి వేశారు.

**ప్రధాని చేతుల మీదుగా.. స్వాగతిస్తున్నాం:**

దేశంలో సాధారణంగా ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రులు మేజర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయాలంటే అన్ని అనుమతులు వచ్చి, ఫైనాన్షియల్ క్లోజర్ అయిన తర్వాతే చేస్తారు. అదే సంప్రదాయాన్ని జగన్‌గారు పాటించారు. ఆయన చెప్పినట్టుగానే జూన్ 2026 నాటికి పనులు పూర్తయి, జూలై 1 నాటికే, ప్రధాని గారు ప్రారంభించే స్థితికి వచ్చింది. ఈ దేశ ప్రధాని స్వయంగా వచ్చి భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించడాన్ని మా పార్టీ తరపున స్వాగతిస్తున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం, దాని నిర్మాణాన్ని ఘనత అంతా తమదే అని చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. చంద్రబాబు హయాంలో 2015 నుంచి 2019 వరకు ఏ ఒక్క ఫార్మాలిటీ పూర్తి కాలేదు. 2023 వరకు ఫైనాన్షియల్ క్లోజర్ అవ్వలేదు. కానీ జగన్‌గారి ప్రభుత్వం రూ.1200 కోట్లు ఖర్చు చేసి, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ (రిహాబిలిటేషన్, రీసెటిల్మెంట్) ప్యాకేజీలు, కనెక్టింగ్ రోడ్లకు నిధులు ఇచ్చింది. నీటి సౌకర్యం కోసం రూ.75 కోట్లు, ఇతర అవసరాలకు రూ.135 కోట్లు కేటాయించింది. ఈ ఎయిర్‌పోర్ట్‌ను రాష్ట్ర బడ్జెట్‌తో నిర్మించడం లేదు. ప్రైవేట్ డెవలపర్ సుమారు రూ.4 వేల కోట్లు బ్యాంక్ రుణాలతో కడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తి కడుతున్న ఎయిర్ పోర్టును చంద్రబాబు, కేంద్ర మంత్రులు పోయి రోజుకోసారి ఇనస్పెక్ట్ చేస్తూ తామే ఏదో ఇంజనీరింగ్ సూపర్ వైజర్లలా బిల్డప్ ఇవ్వడం హాస్యాస్పదం. ఒక్క రోజు లేట్ అయినా ప్రైవేట్ డెవలపర్‌కే నష్టం కాబట్టి వాళ్లే త్వరగా పూర్తి చేస్తారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పార్టిసిపేషన్ ఏమీ లేదు, అది వైయస్. జగన్ హయాంలోనే పూర్తయింది అని ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేసారు.

**సిటీ కనెక్టివిటీ రోడ్డుపై కూటమి ప్రభుత్వ వైఫల్యం**

భోగాపురం ఎయిర్ పోర్టు విశాఖ నగరానికి 40--50 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని వల్ల విశాఖ పౌరులకు ఇబ్బంది కలగకూడదని ఆనాడు వైయస్. జగన్ కేంద్ర మౌళిక సదుపాయాలశాఖ మంత్రితో మాట్లాడి, ప్రధానికి నచ్చజెప్పి రూ.7 వేల కోట్లతో నగరంతో నేరుగా అనుసంధానించే యాక్సెస్ రోడ్డును మంజూరు చేయించారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా ఆ రోడ్డు పనులు ఇంతవరకు ఇసుమంతైనా కదిలాయా? డిపిఆర్ లేదు, టెండర్లు లేవు, పనులు ప్రారంభించలేదు. కనెక్టివిటీ రోడ్డు వేయకపోవడం వల్లే ఈరోజు విశాఖ ప్రజలు ఈ ఎయిర్ పోర్ట్ వల్ల మాకేం ఉపయోగం లేదనే నిరాశలోకి వచ్చారు. ఈ వైఫల్యం కేవలం కూటమి ప్రభుత్వానిదే. ఇదే వైయస్.జగన్ అధికారంలో ఉండి ఉంటే ఎయిర్ పోర్ట్‌తో పాటే ఆ రోడ్డును కూడా పూర్తి చేసేవారు. ఎవరైనా కష్టపడి ప్రాజెక్టులు చేస్తే, దాన్ని 'నేనే చేశాను' అని ప్రచారం చేసుకోవడం చంద్రబాబుకి మొదటి నుంచీ ఉన్న అలవాటు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి గారు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదిస్తే, అసెంబ్లీలో చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ దాన్ని తీవ్రంగా విమర్శించింది. దుర్వినియోగం అయిపోతుందని అడ్డుపడింది. ఆనాడు రెవెన్యూ మంత్రిగా అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ జరిపి నేను సమాధానం చెప్పాను. కానీ ఈరోజు చంద్రబాబు 'ఓఆర్ఆర్ నేనే ప్రతిపాదించాను, నేనే చేశాను' అని చెప్పుకుంటున్నారు. ప్రపంచంలో, దేశంలో ఏది జరిగినా 'నేనే ఇనిషియేట్ చేశాను' అని చెప్పుకోవడం ఆయనకు ఒక వ్యసనంలా మారిందిని ధర్మాన ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# ఇక డీమార్ట్ మెడికల్ షాపులు

**20 శాతం వరకు డిస్కౌంట్**

**పైలట్ ప్రాజెక్టుగా ఫార్మసీ కౌంటర్లు**

**త్వరలోనే దేశవ్యాప్తంగా స్టోర్స్**

**(ప్రత్యేక ప్రతినిది - జయజయహే)**

మార్కెట్‌లో అన్ని రకాల వస్తువులు ఒక చోట దొరికే మార్ట్‌లకు ఎక్కువ క్రేజ్ ఉంటుంది.. ముఖ్యంగా కిరాణా, గృహోపకరణాలు, వ్యక్తిగత సంరక్షణ అలాగే దుస్తులు ఎలక్ట్రిక్ పరికరాలు.. ఇలా అన్ని కూడా ఒకే చోట దొరికే మార్ట్‌లకు వినియోదారులు ఎక్కువగా వెళ్తుంటారు.. ఎందుకంటే.. అన్ని దొరుకుతాయి కాబట్టి.. అలాంటి వాటిల్లో డీ మార్ట్ ఒకటి.. బయటి మార్కెట్‌తో పోలిస్తే సూపర్‌మార్కెట్ డీమార్ట్ లో అన్ని రకాల వస్తువులు.. సుమారు 5 శాతం నుంచి 20 శాతం తక్కువ ధరలకు లభిస్తాయి. ఈ విషయం అందరికీ తెలిసిందే.. ముఖ్యంగా నగరాల్లో ఉండే వారు ఎక్కువగా ఇలాంటి సూపర్ మార్కెట్‌లకు వెళ్తుంటారు. అయితే.. తాజాగా.. ప్రముఖ సూపర్‌మార్కెట్ చైన్ డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్కెట్స్ రిటైల్ ఫార్మసీ రంగంపై దృష్టి సారించింది. భారీ డిస్కౌంట్స్ తో.. ఫార్మసీ రంగంలో తనదైన ముద్రవేసేందుకు కొత్తగా మెడికల్ ఫార్మసీ కౌంటర్స్ ప్రారంభించనుంది. దీనికోసం ముందుగా ముంబై నగరంలోని డీ మార్ట్ స్టోర్లలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఫార్మసీ కౌంటర్స్ స్టార్ట్ చేసింది. ఈ డీమార్ట్ మెడికల్స్ స్టోర్లలో ఏకంగా 20శాతం డిస్కౌంట్ ప్రకటించి వినియోగదారులను ఆకర్షిస్తోంది. త్వరలో అన్ని డీమార్ట్ స్టోర్లలో మెడికల్స్ కౌంటర్లను అందుబాటులోకి తీసుకురానుంది. అయితే.. దీనివల్ల వినియోగదారులకు మేలు జరుగుతుందని.. ఎంఆర్‌పీ ధరలకు మెడిసిన్స్ విక్రయించే రిటైల్ మెడికల్ షాపులపై ఇవి తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని పేర్కొంటున్నారు. ఇప్పటికే.. చైన్ సూపర్ మార్కెట్స్ తో అన్ని ప్రాంతాల్లో తనదైన ముద్ర వేసుకున్న డీమార్ట్.. ఇప్పుడు ఫార్మా రంగంలో కూడా అడుగుపెడుతుండటం సంచలనంగా మారింది.

# అరుదైన వృక్షజాతికి పవన్ నామకరణం

**యూఫోర్బియేసీ కొత్త జాతికి క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ గా పేరు**

**జీవ వైవిధ్యానికి కూటమి కట్టుబడి ఉంది**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**(అమరావతి - జయజయహే)**

తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్ ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

# విశాఖ ఎయిర్ పోర్టుకు గుడ్ బై

**మొదటి పేజీ తరువాయి...**

అర్ధరాత్రి నుంచి భోగాపురం విమానాశ్రయం నుంచి షెడ్యూల్డ్ విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. దీంతో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి నడిచే సాధారణ వాణిజ్య విమాన సేవలు నిలిచిపోనున్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవాన్ని ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, కూటమి నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక రంగాలకు కీలకంగా మారనుందని అధికారులు చెబుతున్నారు. ప్రారంభోత్సవంలో గిరిజన కళాకారుల ప్రత్యేక ప్రదర్శన ద్వారా గిన్నిస్ రికార్డు సాధించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, శ్రీకాకుళం జిల్లాలోని ప్రజలు కూడా భోగాపురం విమానాశ్రయం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు సజావుగా సాగాలని కోరుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సౌర హోమం, అష్ట దిగ్పాలకుల ఆవాహన, నవగ్రహ ఆవాహన వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్టు 17 నుంచి విశాఖపట్నం విమానాశ్రయం (ఐఎన్‌ఎస్ డేగ సివిల్ ఎన్‌క్లేవ్) నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలు నిలిపివేయనున్నారు. ఈ నిర్ణయం 30 ఏళ్ల కాలానికి వర్తిస్తుందని పేర్కొంది. అయితే జాతీయ అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపు ఉంటుందని తెలిపింది. విశాఖ విమానాశ్రయం నుంచి భారత వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విభాగాలకు చెందిన విమానాలు, ప్రభుత్వ అతిథుల విమానాలు, వీఐపీ, లీజ్ విమానాలు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలకు కూడా అనుమతి ఉంటుందని వెల్లడించింది. ప్రస్తుతం విశాఖపట్నం విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'ఝ్గ'ను ఆగస్టు 17 నుంచి భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేయనున్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా అధికారిక గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేసింది. జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తాజాగా కేంద్రం ఆ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించింది. దీంతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుంది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణరెడ్డికి రిమాండ్

**చంచల్ గూడ జైలుకు తరలింపు**

**ఉదయ్ క్యాష్ పిటీషన్ పై హైకోర్టులో కీలక వాదనలు**

**(హైదరాబాద్ - జయజయహే)**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ఉదయ్‌కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఉదయ్‌కృష్ణారెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డిని అత్తాపూర్ పోలీసులు బుధవారం ఉప్పరపల్లి కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు.. లైంగిక వేధింపుల కేసులో ఉదయ్‌కృష్ణ నిన్న మిర్యాలగూడలో అరెస్ట్ అయ్యారు. ఈ నెల 22 నుంచి పరారీలో ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో అదుపులోకి తీసుకున్నారు. అక్కడనుంచి సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌కు తరలించారు.. ఉదయం ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత ఉప్పరపల్లి కోర్టులో హాజరుపర్చారు. ఇదిలాఉంటే.. ఉదయ్ కృష్ణారెడ్డి క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. నేషనల్ పోలీస్ అకాడమీలో పూర్తిగా పరస్పర అంగీకారంతోనే ఈ ఘటన జరిగిందని ఉదయ్‌కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇద్దరూ ఇష్టంతోనే ఇన్నాళ్లు బాగానే ఉన్నారని, కానీ.. భర్త ఒత్తిడితోనే బాధితురాలు కేసు పెట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ట్రైనీ ఐపీఎస్‌లే సాక్షులుగా ఉన్న ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఎన్ పీ ఏ అధికారులు విచారణ జరుపుతున్నారన్నారు. పోలీసులు కూడా అన్ని ఆధారాలు స్వాధీనం చేసుకున్నందున ఉదయ్‌ను ప్రశ్నించడానికి ఏమీ లేదని చెప్పారు. ట్రైనింగ్ పూర్తవుతున్న తరుణంలో ఆయన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రిమాండ్‌ను రిజెక్ట్ చేయాలని కోరగా, ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. ఇక.. జాతీయ పోలీసు అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఉదయ్ కృష్ణారెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులకు కనిపించకుండా వెళ్లిపోయారు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో నాలుగు ప్రత్యేక బృందాలతో గాలించారు. ఈ క్రమంలోనే.. ఉదయ్‌కృష్ణారెడ్డిని మిర్యాలగూడలో అదుపులోకి తీసుకున్నారు.

# ఇక జాబ్స్ జాతర..

**మొదటి పేజీ తరువాయి...**



వివరించారు. జాబ్ క్యాలెండర్-2026లో భాగంగా మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగాల భర్తీలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగనుంది. తొలి దశలో మొత్తం 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేశారు. రెండో దశలో 3,168 పోస్టులకు సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ దశ నోటిఫికేషన్‌లో ఆలస్యం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు నోటిఫికేషన్ తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించారు. మూడో దశలో 2,388 పోస్టుల భర్తీ చేపట్టనున్నారు. నాలుగో దశలో 2,981 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మూడో, నాలుగో దశలకు సంబంధించిన నోటిఫికేషన్లు అక్టోబర్ 15న విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక హోంశాఖలో ఖాళీగా ఉన్న 2,225 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీస్, భద్రతా విభాగాల్లో అవసరమైన సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పోస్టుల పెంపుపై పరిశీలన**

గ్రూప్-1 పోస్టుల సంఖ్య పెంపు అంశంపై మంత్రుల బృందం అభిప్రాయాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అలాగే జాబ్ క్యాలెండర్-2026లో భాగంగా పూర్తి స్థాయి ఖాళీల వివరాలను వచ్చే కేబినెట్ సమావేశానికి అందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, నియామక ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు. "ప్రతిపక్షాలను చూస్తుంటే ఈ దృశ్యం చాలా నిరాశ కలిగించేలా ఉంది. ఇంతటి ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో, ఎంతో సున్నితత్వంతో ఈ బిల్లును సభలోకి తీసుకొచ్చినప్పుడు సీరియస్‌గా చర్చించి, సలహాలు ఇవ్వడానికి బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత ప్రవర్తన చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. రాహుల్ గాంధీ అప్రజాస్వామిక భాష వాడారు. ఆయన వాడిన పదాలు సభా సంప్రదాయాలకు విరుద్ధమైనవి. అంతేకాదు అది ఎంతటి అన్‌పార్లమెంటరీ పదమంటే ఆ పదాన్ని నేను నా నోటితో ఉచ్ఛరించలేను. ఒకవేళ ఏ వ్యక్తైనా లేదా గౌరవసభ్యుడైనా తనను తాను 'ఇడియట్' అనుకున్నప్పటికీ, ఆ పదాన్ని ఇక్కడ వాడకూడదు. సభ వెలుపల వెళ్లి అనవచ్చు కానీ, సభలో అనటానికి వీల్లేదు. ప్రతిపక్ష నేతకు ఇలాంటి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది." అని పీఎంఓ సహాయ మంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను జితేంద్ర సింగ్ ఖండించారు. "కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు మేజిస్ట్రేట్ ఇస్తారు. అసలు కాల్పులు జరగనే లేదు. బాష్పవాయువు ప్రయోగించారు. కాల్పులు జరగకపోతే ఆదేశాలు ఇచ్చారనే మాటకు అర్థం లేదు. హోంమంత్రి విదేశాలకు వెళ్లారని ఆరోపణలు చేస్తున్నారు. హోంమంత్రి విదేశాలకు వెళ్లినట్లు మాకెలాంటి సమాచారం లేదు. అవాస్తవాలు చెప్పి సభ నుంచి వెళ్లడం బాధ్యతాయుతం కాదు. ప్రధాని నివాసం ముందు బైఠాయించి నిరసన తెలపడం సమంజసం కాదు. ప్రధాని నివాసం ముందు నిరసన సముచితం కాదని చెప్పినా పట్టించుకోలేదు. 150 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అన్నిసార్లు పేపర్ లీక్ అయ్యాయనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. 150 సార్లు పేపర్ లీక్ వల్ల 750 కోట్ల విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. దేశ జనాభాను ప్రపంచ జనాభాతో పోల్చి ప్రియాంక చెప్పారు. ఎన్‌డీఏ హయాంలో 30 శాతం మేర ఉన్నత విద్యాలయాలు పెరిగాయి. ఎన్‌డీఏ హయాంలో 763 యూనివర్సిటీల నుంచి 1293కి పెంచాం." అని జితేంద్ర సింగ్ అన్నారు.

**గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష**

పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు-2026ను ఇంతకుముందు కేంద్రం ప్రతిపాదించింది. పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించింది. జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేసింది. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను కోటి నుంచి 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చింది. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదన చేసింది. నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, 5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను కోటి నుంచి 10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది.

# వ్యవస్థలని నాశనం చేయడమే జగన్ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

వాటన్నింటినీ పునరుద్ధరించటంతో నేరస్తుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే.. దానిని హత్యగా చిత్రీకరించి రాజకీయంగా ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. సీసీ టీవీ ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోక ముడిచారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి.. దానిని ఎదుటి వారిపై రుద్దాలని చూస్తారని వ్యాఖ్యానించారు. ఆలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్తుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు.

# పుష్కర ఘాట్లను పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజి జి.వి.జి. అశోక్ కుమార్





## భద్రత, ట్రాఫిక్, డ్రోన్ నిఘాపై అధికారులకు కీలక ఆదేశాలు

**రాజమహేంద్రవరం, జులై 29:**

గోదావరి పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకుని భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ఏర్పాట్లు కల్పించేందుకు ఏలూరు రేంజ్ ఐ జి జి.వి.జి. అశోక్ కుమార్,, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, తో కలిసి జిల్లాలోని ప్రధాన పుష్కర ఘాట్లను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కోటిలింగాల రేవు ఘాట్, పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరులోని గోష్పాద క్షేత్ర ఘాట్, దండగండ రేవు ఘాట్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, భక్తుల రాకపోకలకు అనుకూల పరిస్థితులు, అత్యవసర స్పందన వ్యవస్థలపై సమగ్రంగా పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికపై ఐజీ విస్తృతంగా సమీక్షించారు. ప్రతి ఘాట్ వద్ద తగిన పోలీసు బందోబస్తు, భక్తుల ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, బ్యారికేడింగ్, వాహనాల పార్కింగ్, బస్ బేలు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ నిఘా, వాచ్ టవర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కంట్రోల్ పాయింట్లు, అత్యవసర స్పందన బృందాల ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఘాట్ల పరిశీలనలో గుర్తించిన లోపాలను త్వరితగతిన పరిష్కరించాలని, పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, మున్సిపల్, రవాణా, వైద్య, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఐజి ఆదేశించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రతి విభాగం పూర్తి స్థాయి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. ఈ ఘాట్ల పరిశీలన, సమీక్ష సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, , తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, , జిల్లాలోని జోనల్ డిఎస్పీలుతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జగన్‌కు ఘన స్వాగతం పలకండి

## వైసీసీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు

**విశాఖపట్నం, జూలై 29, జయ జయహే :**



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకోనున్నారని విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు తెలిపారు. విమానాశ్రయం నుండి ఆయన రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరనున్నారని ఈ సందర్భంగా ఆయన విశాఖ విమానాశ్రయం...ఎనఏడీ జంక్షన్... గోపాలపట్నం జంక్షన్...సింహాచలం ఆర్చ్ ...గోపాలపట్నం పెట్రోల్ బంక్... సింహాచలం ...అడివివరం జంక్షన్...శొంఠ్యాం జంక్షన్ సర్వీస్ రోడ్డు... నీలకుండీలు జంక్షన్...ఆనందపురం జంక్షన్... తగరపువలస... భోగాపురం...విజయనగరం బైపాస్ మీదుగా శ్రీకాకుళం వరకు వెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ సమన్వయకర్తలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, శాసన మండలి సభ్యులు, మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ పరిశీలకులు, పి.ఎ.సి., సి.ఇ.సి., ఎస్.ఇ.సి. సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర పార్టీ కమిటీ అధికార ప్రతినిధులు, సంయుక్త కార్యదర్శులు, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ మరియు అనుబంధ విభాగాల జిల్లా, నియోజకవర్గం, మండలం, వార్డు అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి, శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**రాజమహేంద్రవరం :జూలై 29: జయ జయహే**



స్థానిక మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని)లో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దానవాయిపేట గాంధీ పార్కు యోగ మిత్ర మండలి గురువు సూరపరెడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఓంకార ప్రార్థన, వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. అనంతరం భక్తులు శివుడి భస్మాభిషేకాన్ని వీక్షించి ప్రత్యేక పూజలు చేశారు. వేదవ్యాస మహర్షిని స్మరించుకుంటూ గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు సూరపరెడ్డి తాతారావును నూతన వస్త్రాలు, పూలు, పండ్లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిసాల బాపూజీ, రామానాయుడు, రొక్కం గోపి, భొల్ల పెద్ద సత్తిబాబు, బి. సంతోష్, కే. శ్రీనివాస్, వెలిశెట్టి రాము, సూరిబాబు, గౌరీశంకర్, వెంకటనాయుడు, నూజిళ్ల సూరిబాబు, టీ. పాపారావు, కర్రి సుబ్బారెడ్డి, ఎం. నాగేశ్వరరావు, అముజూరి ఈశ్వరి, ముప్పన వరలక్ష్మి, కళ్యాణి, అనిశెట్టి పద్మ, బి. వెంకటలక్ష్మి, సన్నీ సత్యకళ, కే. హేమ, కే. వెంకటలక్ష్మి, వి. సురేఖ, కే. లక్ష్మి, శ్రీదేవి, నూజిళ్ల రాణి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే గంటాకు మంత్రుల పరామర్శ

**విశాఖపట్నం, జులై 29, జయ జయహే**

కాలి వేలికి సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యనాయకులు బుధవారం ఎంవీపీ కాలనీలోని నివాసంలో కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గంటాను కలిసిన వారిలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, అరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు ఉన్నారు.



# రత్నం పేటలో ఘనంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం..

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జులై 30,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రత్నం పేట పంచాయతీ లో మంగళవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వీర సత్యనారాయణ (దొరబాబు) అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు గత 2 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. పసుపు కరపత్రాలను పంచి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో యూనిట్ ఇంచార్జి లింగేటి శంకర్, కో క్లస్టర్ ఇంచార్జి పాడి వెంకటేశ్,నల్లగొండ యూనిట్ ఇంచార్జి లోతా సింహచలం,బూత్ కన్వీనర్ కారెం సత్యశ్రీ, అల్లు బాలరాజు, పాంగి భీమరాజు తో పాటు గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్న హోంమంత్రి అనిత

**విశాఖపట్నం, జులై 29, జయ జయహే**

విశాఖపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పూర్ణ మార్కెట్ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురుపౌర్ణమి సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోంమంత్రి అనితకు దేవస్థాన అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా,ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోంమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో ఆప్యాయంగా మాట్లాడిన హోంమంత్రి అనిత వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సత్యనారాయణ స్వామిని వారిని మంత్రి ప్రార్థించారు.

# కూటమిలో పదవుల పంట

మొదటి పేజీ తరువాయి...

నాటికి సుమారు 30కి పైగా సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో ఎమ్మెల్యే కోటా, స్థానిక సంస్థల కోటా, గవర్నర్ నామినేటెడ్, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఖాతాలో పడిన స్థానాలన్నీ వరుసగా ఖాళీ అవుతూ వస్తున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కనీస బలం కూడా లేకపోవడంతో, త్వరలో ఖాళీ కాబోయే ప్రతి ఒక్క సీటూ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి.

### గవర్నర్, ఎమ్మెల్యే కోటాల్లో రాబోయే పెను మార్పులు

ముఖ్యంగా 2026 నుంచి 2027 చివరి నాటికి గవర్నర్ నామినేటెడ్ కోటాలో 6 సీట్లు, ఎమ్మెల్యే కోటాలో దాదాపు 7 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు స్థానిక సంస్థల కోటాలో కూడా 10 స్థానాల గడువు ముగియనుంది. అప్పటికి స్థానిక ఎన్నికలు అయిపోతాయి. సహజంగానే అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సంపూర్ణ ఆధిక్యంతో ఎమ్మెల్యే కోటాలోని స్థానాలన్నీ కూటమికే దక్కుతాయి. మెజారిటీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపడం లేదా ఖాళీలు ఏర్పడటంతో ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయం సునాయాసంగా మారనుంది.

### 2029 నాటికి తిరుగులేని ఆధిపత్యం

2029 మార్చి నాటికి ఎమ్మెల్యే కోటాలో మరో 7 స్థానాలు ఖాళీ కానుండటంతో పాటు, పట్టభద్రుల. ఉపాధ్యాయుల స్థానాల గడువు కూడా పూర్తికానుంది. పట్టభద్రుల స్థానాల్లో ఇప్పటికే కూటమికి విపరీతమైన ఆమోదయోగ్యత ఉందని గత ఫలితాలు నిరూపించాయి. దీనివల్ల నాటి ఎన్నికల నాటికి శాసనమండలిలో వైఎస్ఆర్‌సీపీ ప్రాతినిధ్యం దాదాపు శూన్యానికి చేరుకుని, మండలిలో ఎన్డీయే కూటమికి తిరుగులేని సంపూర్ణ మెజార్టీ లభిస్తుంది. కేవలం శాసనమండలి మాత్రమే కాదు, ఢిల్లీలోని రాజ్యసభ సీట్ల సమీకరణలు కూడా కూటమికి అత్యంత సానుకూలంగా మారాయి. ఎంపీల పదవీకాల ముగింపు క్రమంలో 2028లో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలు నూరు శాతం కూటమి ఖాతాలోనే పడనున్నాయి. కేంద్రంలోనూ ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ-జనసేనలకు ఈ రాజ్యసభ స్థానాలు దక్కడం వల్ల జాతీయ రాజకీయాల్లోనూ కూటమి నేతల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం మరింత పెరగనుంది.

### ఆశావహులకు సందేశం

ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తే, ప్రస్తుతం గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం టీడీపీ అగ్రనేతలపై ఒత్తిడి తేవడం లేదా నిరాశకు గురికావడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో దాదాపు 30కి పైగా ఎమ్మెల్సీ స్థానాలు, 4 రాజ్యసభ స్థానాలు అందుబాటులోకి రానున్నందున.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, సామాజిక సమీకరణల్లో వెనుకబడిన నాయకులు, ఎన్నికల్లో త్యాగాలు చేసిన అభ్యర్థులకు విడతల వారీగా పదవులు అప్పగించేందుకు చంద్రబాబు వద్ద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందని చెబుతున్నారు. పార్టీ శ్రేణులు ఓపిక పడితే ప్రతి అర్హులైన నాయకుడికీ తగిన గుర్తింపు లభించడం ఖాయమని అంటున్నారు.

# పెదపెంకి రోడ్డు పనుల్లో ప్రమాణాలకు తిలోదకాలు

మొదటి పేజీ తరువాయి...



రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ స్పష్టం చేశారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక శాసనసభ్యులు కూడా తీసుకోవాలని సూచించారు.

# పశుగ్రాసంపై ఎల్‌నినో ప్రభావం

## పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి.


## డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ డాక్టర్. డబ్ల్యూ. రాంబాబు

**జయ జయహే - నర్సీపట్నం :**



ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించినంత మేర కురవపోవడంతో ఈ ఏడాది పశుగ్రాసానికి కొరత ఏర్పడే అవకాశం ఉందని , ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో ప్రశుగ్రాసాన్ని నిలవ చేసుకుంటే ఎల్‌నినో పరిస్థితిని అధిగమించవచ్చుని డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ డాక్టర్. డబ్ల్యూ. రాంబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కారణంగా గత సంవత్సరంతో పోలిస్తే కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే వరి సాగు జరిగిందని, సాగు చేసిన రైతులు కూడా తక్కువ వ్యవధి కలిగిన వరి రకాలను ఎంచుకున్నారని డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ డా. డబ్ల్యూ. రాంబాబు తెలిపారు. మిగిలిన సుమారు 85 శాతం మంది రైతులు తమ వ్యవసాయ భూములను బీడుగా ఉంచారని , ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఖాళీగా ఉన్న భూముల్లో తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వార్షిక పశుగ్రాస పంటలైన జొన్న, మొక్కజొన్న, గంటి (ఫోడర్ కౌపీ), సజ్జలు, హైబ్రిడ్ నేపియర్, గినియా గడ్డి, స్టైలో వంటి పశుగ్రాస పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలు తక్కువ కాలంలో మంచి పచ్చిమేతను అందించడంతో పాటు, పశువులకు అవసరమైన పోషకాలను సమృద్ధిగా అందిస్తాయని తెలిపారు. పచ్చిమేతను కోసిన తర్వాత సైలేజ్ లేదా హే రూపంలో నిల్వ చేసుకుంటే రాబోయే రబీ సీజన్‌తో పాటు ఎండాకాలంలో కూడా పశుగ్రాస కొరత లేకుండా పశువులకు మేత అందించవచ్చని తెలిపారు. పచ్చిమేత అందుబాటులో ఉండటం వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు దాణా ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని వివరించారు. పశుగ్రాస సాగు ద్వారా భూమి సారవంతత కూడా మెరుగుపడుతుందని , పశువుల ఆరోగ్యం బాగుండి సంతానోత్పత్తి సామర్థ్యం, పాల దిగుబడి పెరుగుతాయని తెలియజేశారు. రైతులు తమ గ్రామ పరిధిలోని పశు వైద్యాధికారులు, పశుసంవర్ధక సహాయకులను సంప్రదించి తమ ప్రాంతానికి అనువైన పశుగ్రాస రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు కనీసం తన పశువుల అవసరానికి సరిపడా పశుగ్రాసాన్ని సాగు చేసి, మిగిలిన మేతను నిల్వ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటతో పాటు పశుగ్రాసాన్ని కూడా పండిస్తే రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా, భవిష్యత్తులో పశుగ్రాస కొరతను అధిగమించి పాడి పరిశ్రమను లాభదాయకంగా కొనసాగించవచ్చని ఆయన తెలిపారు.

For a pure tomorrow.. జయహో



## తెలియని ఒత్తిడితో...
# తెలివిని కోల్పోకు

**జీవితాన్ని మార్చేది పరిస్థితులు మాత్రమే కాదు...**
**వాటి గురించి మనం చేసే ఆలోచనలు కూడా**

**ఆధునిక సమాజాన్ని కబళిస్తున్న కనిపించని మహమ్మారి -- మానసిక ఒత్తిడి**

**నేటి ప్రపంచంలో మానసిక ఆరోగ్యం ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవిస్తున్నారు. వేగవంతమైన జీవనశైలి, పెరుగుతున్న పోటీ, ఆర్థిక ఒత్తిళ్లు, సామాజిక మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.**

ఒకప్పుడు మనిషి ఎక్కువగా పేదరికంతో, అనారోగ్యంతో పోరాడేవాడు. ఇప్పుడు వాటితో పాటు కనిపించని శత్రువైన మానసిక ఒత్తిడితో కూడా పోరాడుతున్నాడు. ఉదయం కళ్లు తెరిచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు ఉద్యోగం, చదువు, వ్యాపారం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తుపై ఆందోళన... ఇలా ఎన్నో ఆలోచనలు మనసును అలసటకు గురిచేస్తున్నాయి.

సమస్యల కంటే... వాటి గురించి ఆలోచనలే పెద్దవి

చాలాసార్లు మనల్ని బాధించేది సమస్య కాదు. ఆ సమస్య గురించి మనం ఊహించుకునే పరిణామాలే ఎక్కువ బాధిస్తాయి.

"ఒకవేళ నేను విఫలమైతే?"
"ఉద్యోగం రాకపోతే?"
"వ్యాపారంలో నష్టమైతే?"
"ఇతరులు ఏమనుకుంటారు?"

ఇలాంటి ప్రశ్నలు ఇంకా జరగని సంఘటనలను ముందుగానే మనసులో నిజాలుగా మార్చేస్తాయి. దాంతో ఈరోజు ప్రశాంతంగా జీవించాల్సిన జీవితాన్నే కోల్పోతాం.

ఒత్తిడి దెబ్బతీసేది ఆలోచనా శక్తిని ఒత్తిడి పెరిగినప్పుడు మొదట ప్రభావితమయ్యేది మన ఆలోచనా విధానం. సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది. చిన్న సమస్య కూడా పెద్దదిగా అనిపిస్తుంది. కోపం పెరుగుతుంది. సహనం తగ్గుతుంది. కుటుంబ సంబంధాలు, ఉద్యోగ జీవితం, ఆరోగ్యం అన్నీ ప్రభావితమవుతాయి.

అందుకే ప్రశాంతమైన మనసుతో తీసుకునే ఒక నిర్ణయం, ఆవేశంలో తీసుకునే ఎన్నో నిర్ణయాల కంటే మెరుగైన ఫలితాన్ని ఇస్తుంది.

### సోషల్ మీడియా... కొత్త ఒత్తిడికి వేదిక

సోషల్ మీడియా మనుషులను దగ్గర చేసింది. అదే సమయంలో పోలికల సంస్కృతిని కూడా పెంచింది.

ఇతరుల విజయాలు మాత్రమే కనిపిస్తున్నాయి. కానీ ఆ విజయాల వెనుక ఉన్న కష్టం, వైఫల్యాలు, త్యాగాలు కనిపించడం లేదు. దీంతో చాలామంది తమ జీవితాన్ని ఇతరులతో పోల్చుకొని అసంతృప్తికి గురవుతున్నారు.

ఇతరుల జీవితాన్ని చూస్తూ... తన జీవితాన్ని ఆస్వాదించడం మరిచిపోవడం నేటి సమాజంలో పెరుగుతున్న ఆందోళనకర పరిణామం.

### విజయం కోసం పరుగులు... ప్రశాంతతకు దూరం

పిల్లలపై మార్కుల ఒత్తిడి, యువతపై ఉద్యోగ ఒత్తిడి, ఉద్యోగులపై లక్ష్యాల ఒత్తిడి, వ్యాపారులపై ఆర్థిక ఒత్తిడి... ఇలా ప్రతి వర్గం ఏదో ఒక రకమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

విజయం సాధించడం తప్పు కాదు. కానీ ఆ విజయ ప్రయాణంలో ఆరోగ్యం, కుటుంబం, మనశ్శాంతిని కోల్పోవడం మాత్రం విజయం కాదు.

### ఒత్తిడిని ఎలా అధిగమించాలి?

ఒత్తిడిని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోవచ్చు. కానీ దాన్ని నియంత్రించడం మాత్రం సాధ్యమే.

పంచుకోండి: సమస్యలను ఒంటరిగా మోసుకెళ్లకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలి

సమయం కేటాయించండి: ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం, నడక, ధ్యానం లేదా ప్రకృతితో గడపాలి

ఆరోగ్యం: తగిన నిద్ర, సమతుల ఆహారం మానసిక ఆరోగ్యానికి అవసరం

సహాయం తీసుకోండి: మనసు ఎక్కువకాలం భారంగా అనిపిస్తే మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించడంలో ఎలాంటి సంకోచం ఉండకూడదు. అది బలహీనత కాదు... బాధ్యత.

### మనశ్శాంతే అసలైన విజయం

డబ్బు సంపాదించవచ్చు. పదవులు పొందవచ్చు. విజయాలను అందుకోవచ్చు. కానీ కోల్పోయిన మనశ్శాంతిని తిరిగి పొందడం అంత సులభం కాదు.

ప్రపంచాన్ని గెలవాలనే ముందు... మన మనసును గెలవాలి.

మన జీవితాన్ని నాశనం చేసేది సమస్యలు కాదు... వాటి గురించి మనం నిర్మించుకునే భయాలే.

తెలియని రేపటి గురించి ఆందోళన పడుతూ... తెలిసిన ఈరోజును కోల్పోవద్దు.

### గుర్తుంచుకోండి:

ఒత్తిడి జీవితంలో భాగం. కానీ అది జీవితాన్ని నడిపించే శక్తిగా మారకూడదు. ప్రశాంతంగా ఆలోచించే మనసు ముందు ఎంత పెద్ద సమస్యైనా చిన్నదే.



జి. అజయ్ కుమార్

# ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న జెన్-జీ ఉద్యమాలు

(హెచ్.ప్రతాప్)

**భారతదేశంలో నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ వివాదం కేవలం పరీక్షా నిర్వహణలో జరిగిన లోపానికి పరిమితం కాలేదు. దేశ విద్యా వ్యవస్థపై కోట్లాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికి ఎదురుదెబ్బగా మారింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే జాతీయ స్థాయి పరీక్షలో అక్రమాల ఆరోపణలు వెలుగులోకి రావడం, విచారణ ప్రక్రియలో ఏర్పడిన సందిగ్ధత, పరీక్షను రద్దు చేయాలా లేదా మళ్లీ నిర్వహించాలా అనే అంశాలపై నెలకొన్న అనిశ్చితి దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఢిల్లీతో ప్రారంభమైన నిరసనలు బీహార్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళతో పాటు పలు రాష్ట్రాలకు విస్తరించాయి. పరీక్షల పారదర్శకత, బాధ్యతాయుతమైన పరిపాలన, స్వతంత్ర విచారణ, వ్యవస్థలో సంస్కరణలను కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు గళమెత్తాయి.**



ఈ వివాదం ఒక కీలక వాస్తవాన్ని గుర్తుచేసింది. నేటి యువతకు పరీక్షలు కేవలం మార్కులు లేదా ర్యాంకుల పోటీ మాత్రమే కావు; అవి జీవితాన్ని మార్చే అవకాశాల ద్వారం. ఆ అవకాశాలపై అనుమానం ఏర్పడితే అది ఒక విద్యా సమస్యగా కాకుండా, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పరిపాలనా బాధ్యత వంటి విస్తృత అంశాలుగా రూపాంతరం చెందుతుంది. పెరుగుతున్న నిరుద్యోగం, తీవ్రమవుతున్న పోటీ, అవకాశాల అసమాన పంపిణీ, అవినీతి ఆరోపణలు, ప్రభుత్వ వ్యవస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలు ఇప్పటికే యువతలో అసంతృప్తిని పెంచుతున్నాయి. నీట్ పరీక్షా వివాదం ఆ అసంతృప్తికి ఒక స్పష్టమైన రూపాన్ని ఇచ్చింది.

భారతదేశంలో కనిపిస్తున్న ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా కూడా స్పష్టంగా కనిపిస్తోంది. జెన్-జీ తరం ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కొత్త రాజకీయ శక్తిగా అవతరిస్తోంది. ఈ తరం ఉద్యమాల ప్రత్యేకత ఏమిటంటే, అవి సంప్రదాయ రాజకీయ పార్టీల నాయకత్వంపై ఆధారపడవు. సామాజిక మాధ్యమాలే వీటి ప్రధాన వేదిక. ఒక హ్యాష్‌ట్యాగ్, ఒక వీడియో, ఒక ప్రత్యక్ష ప్రసారం కొన్ని గంటల్లోనే లక్షలాది మంది యువతను ఏకం చేసే శక్తిగా మారుతోంది. ఉద్యమాలు ఇక వీధుల్లో మాత్రమే కాకుండా డిజిటల్ ప్రపంచంలోనూ సమాంతరంగా సాగుతున్నాయి.

గత కొన్నేళ్లలో ప్రపంచంలోని అనేక దేశాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలిచాయి. బంగ్లాదేశ్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా విధానానికి వ్యతిరేకంగా ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం చివరకు రాజకీయ మార్పులకు దారితీసింది. కెన్యాలో 2024లో ప్రతిపాదిత ఆర్థిక బిల్లుకు వ్యతిరేకంగా యువత చేపట్టిన రిజెక్ట్ ఫైనాన్స్ బిల్ ఉద్యమం ప్రభుత్వం బిల్లును వెనక్కి తీసుకునే పరిస్థితిని సృష్టించింది. శ్రీలంకలో "అరగలయ" ఉద్యమం ఆర్థిక సంక్షోభం, అవినీతిపై ప్రజా ఆగ్రహానికి ప్రతీకగా నిలిచి అధికార మార్పులకు దారితీసింది. థాయ్‌లాండ్, హాంకాంగ్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం, సెర్బియా, నేపాల్, ఇండోనేషియా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ జవాబుదారీతనంపై యువత విస్తృత నిరసనలు చేపట్టింది. ఈ ఉద్యమాలన్నీ ఒకే సందేశాన్ని అందిస్తున్నాయి---కొత్త తరం కేవలం పాలనను విమర్శించడం కాదు; పారదర్శకత, న్యాయం, సమాన అవకాశాలతో కూడిన వ్యవస్థను కోరుతోంది.


ప్రపంచ ఆర్థిక వేదిక విశ్లేషణల ప్రకారం, డిజిటల్ మాధ్యమాల విస్తరణతో యువత రాజకీయ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఐక్యరాజ్యసమితి అధ్యయనాలు యువతలో ప్రభుత్వాలపై నమ్మకం తగ్గినప్పుడల్లా సామాజిక ఉద్యమాలు వేగంగా విస్తరిస్తాయని సూచిస్తున్నాయి. అందువల్ల ఆధునిక ప్రజాస్వామ్యంలో పాలన అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు; ప్రజల విశ్వాసాన్ని నిరంతరం నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత.

నీట్ పేపర్ లీక్ వివాదం భారతదేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల భద్రత, సమాన అవకాశాలు, బాధ్యతాయుతమైన పరిపాలనకు ప్రత్యామ్నాయం లేదు. అదే సమయంలో ప్రపంచ జెన్-జీ తరం ఉద్యమాలు మరో గుణపాఠాన్ని నేర్పుతున్నాయి. యువతను కేవలం నిరసనకారులుగా కాకుండా, విధాన రూపకల్పనలో భాగస్వాములుగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వారి ఆందోళనలను వినడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, సంస్థలపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యంగా మారింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత స్వరం బలపడటం అస్థిరతకు సంకేతం కాదు; వ్యవస్థ సజీవంగా ఉందనడానికి నిదర్శనం. ఆ స్వరాన్ని అణచివేయడం కంటే, సంస్కరణలకు మార్గదర్శకంగా మలచడం సమాజ ప్రయోజనాలకు అనుకూలం. ఎందుకంటే నేటి యువత రేపటి నాయకులు మాత్రమే కాదు; వర్తమానాన్ని ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సామాజిక శక్తి కూడా.

# సమాజంలో మృగ్యమైపోతున్న మానవత్వం

(హెచ్.ప్రతాప్)




ప్రపంచం సాంకేతికంగా ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, మానవీయ విలువలు అదే స్థాయిలో బలపడుతున్నాయా అనే ప్రశ్న నేడు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ విప్లవం, ఆధునిక జీవనశైలి మనిషి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నప్పటికీ, కరుణ, దయ, సహనం, పరస్పర గౌరవం, జీవితం పట్ల విలువ వంటి మానవీయ లక్షణాలు క్రమంగా క్షీణిస్తున్నాయనే భావన బలపడుతోంది. ఇటీవల వెలుగుచూసిన అనేక దారుణ ఘటనలు ఈ ఆందోళనను మరింత పెంచుతున్నాయి.

జాతీయ నేర గణాంకాల ప్రకారం దేశంలో హత్యల సంఖ్య గతంతో పోలిస్తే కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ, ప్రతి సంవత్సరం వేలాది హత్యలు నమోదవుతున్నాయి. 2023లో దేశవ్యాప్తంగా 27,721 హత్య కేసులు నమోదు కాగా, 2024లో కూడా 27 వేలకుపైగా హత్యలు నమోదయ్యాయి. అలాగే 2023లో మహిళలపై 4.48 లక్షల నేరాలు, పిల్లలపై 1,77,335 నేరాలు నమోదయ్యాయి. పిల్లలపై నేరాలు ఏడాదిలోనే 9 శాతం కంటే ఎక్కువ పెరగడం ఆందోళన కలిగించే అంశం.

ఈ గణాంకాల వెనుక దాగి ఉన్న విషాదాలను పరిశీలిస్తే మానవత్వం ఎంతగా దెబ్బతింటోందో అర్థమవుతుంది. పశ్చిమ బెంగాల్‌లో 11 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. బాలల రక్షణ సమాజం యొక్క ప్రాథమిక బాధ్యత అయినప్పటికీ, అమాయక చిన్నారులే అత్యంత దారుణ నేరాలకు బలవుతున్న పరిస్థితి ఆందోళనకరం. బాలికలపై లైంగిక దాడులు ఇంకా తీవ్రమైన సామాజిక సవాలుగానే కొనసాగుతున్నాయని ఈ ఘటన గుర్తు చేసింది.

బెంగళూరులోని ఒక కార్పొరేట్ సంస్థ ప్రాంగణంలోని డేకేర్ కేంద్రంలో చిన్నారులపై దుర్వ్యవహారం జరిగిందనే ఆరోపణలు కూడా సమాజాన్ని కలచివేశాయి. ప్రేమ, ఆప్యాయత అందాల్సిన ప్రదేశంలో భయం, నిర్లక్ష్యం, హింస కనిపించడం కేవలం ఒక సంస్థ వైఫల్యం కాదు; పిల్లల పట్ల మన సామాజిక బాధ్యత తగ్గిపోతోందనే సంకేతం.

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన శ్రద్ధా వాకర్ హత్య కేసు మానవత్వం ఎంతటి దిగజారుడు స్థితికి చేరవచ్చో చూపించింది. దర్యాప్తు సంస్థల ఆరోపణల ప్రకారం అత్యంత సన్నిహిత సంబంధంలో ఉన్న వ్యక్తి చేసినట్లు ఆరోపించబడిన ఈ హత్య, అనంతరం జరిగినట్లు చెప్పబడిన అమానుష చర్యలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ కేసు న్యాయ విచారణలో ఉన్నందున తుది తీర్పు న్యాయస్థానాలదే అయినప్పటికీ, మానవ సంబంధాల్లో విశ్వాసం, గౌరవం, సహనం కోల్పోతే ఎంతటి విషాదాలు సంభవించవచ్చో ఈ సంఘటన గుర్తు చేసింది.

ఈ మూడు సంఘటనలు వేర్వేరు నేపథ్యాల్లో జరిగినప్పటికీ ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. పిల్లలపై హింస, సంరక్షణలో క్రూరత్వం, అత్యంత సన్నిహిత సంబంధాల్లోనే అమానుష హత్యలు---ఇవి సమాజంలో మానవీయ విలువలు క్షీణిస్తున్నాయనే సంకేతాలు. భౌతిక విజయాల కోసం పరుగు, కుటుంబ బంధాల బలహీనత, మానసిక ఒత్తిళ్లు, మత్తు పదార్థాల దుర్వినియోగం, హింసాత్మక వినోదం ప్రభావం, సామాజిక మాధ్యమాల్లో అసంవేదనశీలత వంటి అనేక అంశాలు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి.

ఈ ధోరణిని మార్చాలంటే కుటుంబమే మొదటి పాఠశాల కావాలి. పిల్లలకు మార్కులు, ఉద్యోగాలు మాత్రమే కాకుండా దయ, క్షమ, సహనం, మహిళల పట్ల గౌరవం, ఇతరుల బాధను అర్థం చేసుకునే మనస్తత్వాన్ని చిన్ననాటి నుంచే అలవాటు చేయాలి. పాఠశాలల్లో నైతిక విద్య, జీవన నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ, డిజిటల్ బాధ్యత వంటి అంశాలను బలోపేతం చేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడం కూడా అవసరం.



అదే సమయంలో పిల్లల సంరక్షణ కేంద్రాలపై క్రమం తప్పని తనిఖీలు, మహిళలు, చిన్నారుల భద్రతకు కఠిన చట్టాల సమర్థ అమలు, వేగవంతమైన దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు, బాధితులకు మానసిక సహాయం వంటి చర్యలు మరింత బలోపేతం కావాలి. మీడియా, సామాజిక మాధ్యమాలు నేరాలను సంచలనంగా కాకుండా సామాజిక బాధ్యతతో చర్చించాలి. మత, విద్యా, స్వచ్ఛంద సంస్థలు మానవీయ విలువలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

సమాజ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు. ఒక చిన్నారి భయంలేకుండా జీవించగలగడం, మహిళ గౌరవంగా జీవించగలగడం, మనుషులు పరస్పరం విశ్వాసంతో మెలగగలగడం కూడా నిజమైన అభివృద్ధికి ప్రమాణాలు. మానవత్వం, కరుణ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను కుటుంబం, విద్య, సమాజం, పరిపాలన కలిసి పునరుద్ధరించినప్పుడే రాబోయే తరాలకు మరింత సురక్షితమైన, మానవీయ సమాజాన్ని అందించగలుగుతాం.

# ప్రతి విద్యార్థీ ప్రకృతితో మమేకమై జీవించాలి

### ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత: జెవి రత్నం,

**విశాఖపట్నం /పెందుర్తి (జయ జయహే)**



ప్రకృతితో మమేకమై జీవించాలి అని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం పిలుపునిచ్చారు. బుధవారం పెందుర్తి మండలం పెద్దగాడి చెరువులో ఉన్న సంకల్ప కళా గ్రామంలో మారికవలసకు చెందిన ఇంటెల్లి విద్యా సంస్థ విద్యార్థులను తీసుకువెళ్లి అక్కడ సంకల్ప వ్యవస్థాపకులు ఆకులు చలపతిరావు ఏర్పాటుచేసిన కట్టే కానుక పని చేస్తున్న విధానం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టితో తయారు చేస్తున్న వినాయక ప్రతిమలను చూపించి పూజకు వీటిన వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన రంగురంగుల వినాయకుల బొమ్మల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అక్కడ ఉన్న ఆయుర్వేద మొక్కలను చూపించి వాటి గురించి నా వివరాలు తెలియజేశారు. విభిన్న రకాల పండ్ల మొక్కలు, కూరగాయ మొక్కలు, పక్షులు గూళ్ళు పెట్టుకునే చెట్లను చూపించి వాటి గురించి వివరించారు. అలాగే సంకల్ప కళా గ్రామం ప్రతినిధి జమీలియా ప్రకృతి ఆధారంగా రంగులు వేసి చేస్తున్న కొయ్య బొమ్మల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత అని వివరించారు. ప్రతి విద్యార్థి దేశీయ విత్తనాలు సేకరించి సామాజిక వనాలు పెంచాలని కోరారు. జంక్ ఫుడ్ వద్దే వద్దని దాని వల్ల కలిగే నష్టాలు వివరించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించడానికి ప్రకృతి ఆధారంగా ఉన్న ఆయుర్వేద వైద్యాన్ని పెంచుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి మేడ మీద, బాల్కనీలో, ఇంటి చుట్టుతో ఉన్న ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. కూరగాయలు వేద్దాలతో ఎరువులు తయారు చేసి మొక్కలు పెంచడం ద్వారా ఆ ఇంటి దగ్గర ఉష్ణోగ్రతలు తగ్గించవచ్చని వివరించారు. ఇంటి దగ్గర మొక్కలు పెంచడం ద్వారా మానసిక స్థితి ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటెల్లి ఉపాధ్యాయులు సృజన, శిరీష, శ్రీదేవి, భవానీ, హరిప్రియ, ప్రమీల, స్టెఫీ, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు



# డూప్ హీరోల ప్రదర్శనలకు అనుమతులివ్వాలి

### ప్రభుత్వానికి కళాకారుల విజ్ఞప్తి

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 29:**

సినీ హీరోలను అనుకరిస్తూ నృత్య ప్రదర్శనలు ఇచ్చే (డూప్ హీరోల) కళాకారులను అశ్లీల నృత్యాల జాబితాలో చేర్చకుండా, తమ ప్రదర్శనలకు యథావిధిగా అనుమతులు మంజూరు చేయాలని గోదావరి జిల్లాల సినీ హీరోల అనుకరణ కళాకారుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక గణేష్ చౌక్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు ములపర్తి అనిల్ కుమార్ (ఎన్టీఆర్ ఫేమ్), కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు (శోభన్ బాబు ఫేమ్) మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. కొందరి అశ్లీల ప్రదర్శనల కారణంగా తమలాంటి సాంస్కృతిక కళాకారులకు కూడా అనుమతులు నిరాకరించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అలాగే మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, జిల్లా ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పసలపూడి దివాకర్ బాబు (బాలయ్య ఫేమ్), ఎం. బాబీ (పవన్ కళ్యాణ్ ఫేమ్), శంకర్ (చిరంజీవి ఫేమ్), ధవళేశ్వరం కృష్ణ (కృష్ణ ఫేమ్), రాము (వెంకటేష్ ఫేమ్) తదితర కళాకారులు పాల్గొన్నారు.

# తీవ్ర ఆర్థిక సంక్షోభంలో దేశం

**విశాఖపట్నం (జయ జయహే)**



బీజేపీ ప్రభుత్వం పైకి గొప్పలు చెప్తున్న, వాస్తవాలు దానికి భిన్నంగా ఉన్నాయి, దేశం తీవ్ర ఆర్థిక సంక్షేభంలో ఉందని కాంగ్రెస్ నాయకులు జగన్ మురారి అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం సర వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్తున్నారు మరి సామాన్యుడు ఆర్థికంగా ఎందుకు ఇబ్బంది పడుతున్నాడు, చిన్న, పెద్ద వ్యాపారాలు ఎందుకు బలహీన పడుతున్నాయి, ఆదాయం తగ్గి ప్రతి కుటుంబం మీద అప్పుల భారం పెరుగుతోంది, బ్యాంక్ రుణాలు చెల్లించలేని పరిస్థితికి ప్రజలు వచ్చారు. ఏ రోజు ఉద్యోగం నుండి తీసేస్తారో అని కార్పొరేట్ ఉద్యోగులు భయపడుతూ బ్రతుకుతున్నారు. అది ఒక రాజకీయ నాయకుడుకు ఆరోపిస్తే నమ్మాల్సిన అవసరం లేదు, వాస్తవాలు ఏంటో మీ ఇంట్లో ఉన్న పరిస్థితులు చెబుతాయి, సగటు వ్యక్తి ఆదాయం పెరగటం లేదు కాని నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి.మొన్న విద్యా వ్యవస్థలో, నేడు పెట్రోలిమ్ రంగంలో రోజుకొక మంత్రిత్వ శాఖలో అవకతవకలు భయటపడుతున్నాయి. రాబోయే 2,3 నెలలలో దేశం మరింత సంక్షోభం ఎదురుకుంటుందని ఆర్థిక నిపుణులు హేచ్చరిస్తున్నారు. దేశ ప్రజలు మేలుకోవాల్సిన సమయం వచ్చింది. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే హిందూ వ్యతిరేకి, పాకిస్తాన్ సానుభూతి పరులు అంటూ ప్రతి దాడి చేస్తున్నారు, నేను హిందువునే కాని ఈ దేశ పౌరుడిగా నేను మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని జగన్ మురారి అన్నారు.

# విమానాశ్రయం ప్రారంభోత్సవం విజయవంతం కావాలి


**చోడవరం,జూలై 29,జయ జయహే**



**భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆగస్టు ,ఒకటిన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ..బుధవారం స్తానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు స్వయంభూ విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. ఇది ఉత్తరాంధ్రకు తలమానికమన్నారు.**

# వాసవి మాత విగ్రహానికి లక్ష విరాళం

**మాడుగుల జూలై 29 జయ జయహే**



మాడుగుల మండలం ఏం కోడూరు గ్రామంలో గల శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగంగా అమ్మవారి విగ్రహం ఏర్పాటుకు ఏమ్ కోడూరు గ్రామానికి చెందిన ప్రస్తుతం ఉంటున్న కొల్లూరు కామరాజు వనిత దంపతుల కుమారుడు హనీష్, నైనిశాలు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు ఈ మొత్తాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు, వాసవి కమిటీ చైర్మన్ అనప గడ్డి శ్రీనివాసరావులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాతలను అభినందిస్తూ ఈ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి ప్రతినిధులు మేడిశెట్టి జగన్నాథం, పుట్ట గణేష్, రావల శివ, మోహన్ రావు, బుచ్చిబాబు, కాంతారావు, రావాల నానాజీ ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు



# గురువులను సత్కరించుకున్న పాత విద్యార్థులు

**మాడుగుల జులై 209 జయ జయహే**

మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 86 88 సంవత్సరంలో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు అప్పట్లో తమకు చదువు చెప్పి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న అధ్యాపకులను గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ఘనంగా సత్కరించుకున్నారు. విద్యార్థులు ఆర్ అప్పారావు, రామసుందర్రావు ఆధ్వర్యంలో అధ్యాపకులు పి రాంబాబు, పి వెంకటయ్య, కృష్ణ, లక్ష్మీనారాయణ, సూర్యరావు తదితరులను సాలువులతో ఘనంగా సత్కరించి పాదా నమస్కారాలు చేశారు. అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేస్తూ 40 సంవత్సరాలు అయినప్పటికీ తమన గుర్తుపెట్టుకుని సత్కరించడం విద్యార్థుల కు గురువులపై ఉన్న గౌరవం చాటి చెప్తుందని కొనియాడారు.



# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**మాడుగుల జూలై 29 జయ జయహే**

గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం మాడుగుల శ్రీ శిరిడి సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నగర్ సంకీర్తనతో ప్రారంభమై కాకడ హారతి, మృత్యుంజయ హోమం, గోపూజ, పంచామృతాభిషేకాలు, సాయి సత్య వ్రతాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద జరిగిన మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు మహిళలచే లలిత పారాయణం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో పల్లకి సేవ చేపట్టి మందిరంలో నామ సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు యఎస్ శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎం సతీష్, ప్రతినిధులు ఎస్ వి ఎస్.రమణ, బి నాగు, రామచంద్రరావు, పీ రవి ,రవిరాజు, ఎస్ ప్రసాద్, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి పి రమేష్, రామకృష్ణ, సుబ్బలక్ష్మి, దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ శిరిడిసాయి ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి అన్నప్రసాద సేవ

### కొయ్యూరు సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ

**కొయ్యురు :(జయ జయహే )న్యూస్ జులై 30,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలో వెలసిన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ, మంప ఎస్ఐ సీదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన సుమారు 600 మంది భక్తులకు ప్రేమతో, భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని వడ్డించారు.పోలీసు అధికారులు స్వయంగా సేవా కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందించడం అందరినీ ఆకట్టుకుంది. విధి నిర్వహణలో ప్రజల భద్రతకు అంకితమైన ఖాకీ అధికారులు, ఆధ్యాత్మిక సేవలోనూ తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహామంగళహారతి నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీ శిరిడి సాయిబాబా ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద సమారాధన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు సేవాభావాన్ని చాటిచెప్పింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు పాల్గొని ఏర్పాట్లలో సహకరించారు. ఖాకీ బాస్‌లు చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని భక్తులు, స్థానికులు ప్రశంసించారు.

# కళ్యాణపులోవ ఆక్రమణలపై అధికారుల ఉదాసీనత

### తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జనసేన రాజు

**చోడవరం జూలై 29 జయ జయహే**



రావికమతం మండలం కళ్యాణపులోవ ఆక్రమణలపై తీగ లాగితే డొంక కదిలింది.చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ పీ వీఎస్ ఎన్ రాజు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా కేంద్ర మాజీ ఇంధన శాఖ కార్యదర్శి ఇ ఏ ఎస్ శర్మ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి లేఖ రాశారు. దీనిపై చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పీ వీఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ, ఈ ప్రాంత రైతుల అభ్యున్నతి కోసం 1970వసంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి కళ్యాణపులోవలో నాలుగు కొండల నడుమ జలాశయాన్ని నిర్మించారన్నారు. ఈ జలాశయం ద్వారా 14 గ్రామాల రైతులకు చెందిన 4484 ఎకరాలకు సాగునీరు అందడంతో పంట పుష్కలంగా పండి రైతులు ఆనందంగా ఉండేవారన్నారు. ఇలాంటి కొండపై చాలా విలువ గల గ్రానైట్ ఉందని గ్రహించి మైనింగ్ మాఫియా కొండలను లీజుకు తీసుకొని తవ్వకాలు మొదలుపెట్టారు. ఒకపక్క మైనింగ్ మాఫియా వ్యర్థాలతో దెబ్బతిన్న కళ్యాణపులోవ జలాశయన్ని వెనుక భాగము నుండి సుమారు 45 ఎకరాల జలాశయ గర్భాన్ని ఇప్పటికే కప్పివేశారు అన్నారు. ఎగువన ఉన్న కొండగేడ్డలు, ఊటగేడ్డల ద్వారా వచ్చే నీటిని జలాశయానికి చేరుకోకుండా వాటికి అడ్డంగా మట్టితో కప్పేయడంతో జలాశయం లోకి నీరు చేరుకో కపోవటంతో సాగునీరు ప్రశ్నార్థికంగా మారిందన్నారు. ఈ జలాశయం పరివాహక ప్రాంతంలో ఒక ఏడాది పుష్కలంగా వర్షాలు పడితే రెండేళ్ల పంటలకు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదన్నారు.ఇలాంటి జలాశయాన్ని వెనుక భాగంలో ఉన్న మట్టి దిబ్బలను సుమారు 30 అడుగుల మేర తవ్వి జలాశయం గర్భాన్ని కప్పేశారన్నారు. దీనిపై అక్కడ గిరిజన సంఘాలు రైతులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన అటు రెవెన్యూ ఇటు నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో గత ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడ జరిగిన అన్యాయాలను పత్రికల ద్వారా ప్రజలకు, అధికారులకు తెలియజేశానన్నారు . దీనిపై స్పందించిన కేంద్ర మాజీ ఇంధన శాఖ కార్యదర్శి శర్మ ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై ఇదే శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి లేఖ రాయడం జరింగిందిన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అను నిత్యం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలని జాగృతం చేస్తూ పర్యావరణం పట్ల, వెనుకబడిన ప్రజల తరపున బలంగా పని చేస్తున్న ఇ ఎ ఎస్ శర్మ కి మా కల్యాణపు లోవ ప్రాంత ప్రజల తరపున ధన్యవాదములు తెలుపుతున్నామని పివి ఎస్ఎన్ రాజు అన్నారు.ఏ ప్రాంతంలోనైనా జలాశయాలను కాపాడుకోవాలని చూస్తారు కానీ ఈ ప్రాంతంలో ఇంత ఘోరం జరుగుతున్నా అధికారులు కూడా స్పందించకపోవడం దారుణం అని ఆయన అన్నారు. ఇలాంటి రిజర్వాయర్లను ఇప్పుడు నిర్మించాలంటే వందల కోట్ల రూపాయలు ఖర్చవుతుందన్నారు. . అలాంటిది రిజర్వాయర్ ను ధ్వంసం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం లేదు అన్నారు.ఈ రిజర్వాయర్పై వందలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్య ప్రతి ఒక్కరిపై ఉందని రాజు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తగు నిర్ణయం తీసుకోని ఎడల ప్రభుత్వ పెద్దల దృష్టికి నేరుగా తీసుకు వెళతామన్నారు.

For a pure tomorrow..

# శ్రీ అమ్మ భగవాన్ ఏకం ఆశ్రమంలో ముక్తి గురువులు శ్రీకృష్ణాజి దర్శనం





### దేశం నలుమూలల నుండి భారీ సంఖ్యలో ఆశ్రమానికి చేరిన భక్తులు.

### ఏకం క్షేత్రలో అంగరంగ వైభవంగా గురు పూర్ణిమ వేడుకలు

**వరదయపాలెం, జులై 29,జయ జయహే**

.గురు పూర్ణిమ సందర్భంగా పాలరాతితో నిర్మించబడిన అత్యద్భుతమైన నిర్మాణ కట్టడాలలో ఒకటైన ఏకం, తన తొలి గురు దర్శనాన్ని నిర్వహిస్తోంది. చెన్నై నుండి 80 కి.మీ మరియు తిరుపతి నుండి 80 కి.మీ దూరంలో ఉన్న ఏకంను దాదాపు 50 వేల మంది భక్తులు సందర్శించి, ముక్తి గురు శ్రీ కృష్ణాజీ యొక్క ఇచ్ఛా సిద్ధి ఆశీర్వాదాలను అనుగ్రహన్ని పొందారు.దేశం నలుమూలల నుండి భక్తులు ముక్తి గురు దర్శనం కోసం చేరుకుంటున్నారు, మధ్యాహ్నం 12 గంటలవరకు సుమారు 10 వేలమంది ముక్తి గురువుల దర్శనాన్ని పొందారు. హిందూ భజనలు, వేద మంత్రోచ్చారణలు మరియు కొనసాగుతున్న యజ్ఞాల పవిత్ర అగ్నితో ప్రతిధ్వనిస్తోంది.చెన్నై,ఢిల్లీ నుండి వచ్చిన కీర్తన బృందాలు రోజంతా ప్రదర్శనలు ఇస్తున్నాయి, వీరికి నాసిక్‌లోని త్రయంబకేశ్వర శివాలయం నుండి వచ్చిన నాసిక్ ఢోల్ డ్రమ్మర్ల బృందం తోడైంది. వారి డప్పుల చప్పుడు మరియు దేవతల జయకారాలతో వాతావరణం అప్పుడప్పుడు మార్మోగుతోంది. స్థానిక పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక గ్రామస్తులు కూడా పండరి భజనం మరియు కోలాటం ప్రదర్శిస్త వేడుకలకు మరింత ఉత్సాహాన్ని జోడిస్తున్నారు.ఏకం క్షేత్రలోపల, ముక్తి గురు శ్రీ కృష్ణాజీ మౌనంగా ఆసీనులై, అలంకరించబడిన సాంప్రదాయ పీఠంపై తన ముందు వరుసలుగా వెళ్తున్న భక్తులను ఆశీర్వదిస్తున్నారు. వాలంటీర్లు భక్తి కీర్తనలు, మంత్రోచ్చారణలను కొనసాగిస్తుండగా, భక్తులు నిశ్శబ్ద భక్తి, గౌరవంతో గురువు ముందు నుండి వెళుతున్నారు.భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయబడ్డాయి. అంకితభావం గల వాలంటీర్ సేవా బృందాలు రోజంతా సేవలు అందిస్తున్నాయి, ప్రత్యేక అతిథులు కూడా ముక్తి గురు శ్రీ కృష్ణాజీ దర్శనం ఆశీర్వాదాలు పొందేందుకు రానున్నారు.



## రూ.27.30 కోట్ల త్రాగునీటి సరఫరా పనులకు శంకుస్థాపన

**శ్రీకాళహస్తి, జులై 29,జయ జయహే.**

శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు రూ,27.30 కోట్ల పనులకు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పానగల్ ప్రాంతంలో శంకుస్థాపన చేసిన సంబంధిత పనులను మొత్తం రూ.27.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నీటి సరఫరా మెరుగుదల పథకం కింద మిట్టకండ్రిగ మరియు ఎస్డీకే నగర్ ప్రాంతాల్లో 200 కిలోలీటర్ల సామర్థ్యం గల రెండు ఎత్తైన నీటి నిల్వ ట్యాంకులు నిర్మించనున్నారు. పాత పైప్లైన్ల స్థానంలో ఆధునిక పైప్లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు రాజీవ్ నగర్ ప్రధాన రహదారిలో హెచ్డీపే పైప్లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. పట్టణంలో మొత్తం 9.01 కి.మీ. పంపింగ్ మెయిన్ పైప్లైన్, 22.09 కి.మీ. పంపిణీ వ్యవస్థ అభివృద్ధి చేసి 3,000 ఇంటింటి నీటి కనెక్షన్లు కల్పించనున్నారు. ఈ పనులను హైదరాబాద్ ఎం ఎస్ మెగా కన్స్ట్రక్షన్స్ వారు చేపడు తు న్నారు. కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్, తిరుపతి వారి ఆధ్వర్యం లోచేపట్టారు. కార్యక్రమములో కె. సందీప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్, తిరుపతి . కె.వి. కృష్ణా రెడ్డి , కమీషనర్ , రవి ప్రకాష్ మునిసిపల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్స్, మునిసిపల్ సిబ్బంది పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల డిమాండ్ డేను విజవంతం చేయండి

### ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు

**జయ జయహే - నర్సీపట్నం :**



ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ , ఏపీబీజేఏ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డిమాండ్స్ డే సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ప్రధానంగా ఇళ్ల స్థలాలు ,ఇల్లు మంజూరు చేయాలని, జర్నలిస్టులపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య బీమాను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్స్ తో పాటు మరికొన్ని డిమాండ్స్ పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 31న అనకాపల్లి జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళన కార్యక్రమంలో జర్నలిస్ట్ మిత్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.



## రూ.25 కోట్లతో రాయచోటిలో అంతర్జాతీయ క్రీడా సముదాయం

### ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి మండిపల్లి


### ఢిల్లీలో కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భేటీ

**అమరావతి, జూలై 29, జయ జయహే :**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ మైదానం, ఫుట్‌బాల్ మైదానం, ఫ్లడ్‌లైట్లు, ప్రేక్షకుల గ్యాలరీతో కూడిన అత్యాధునిక క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి సహకారం కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసిన మంత్రి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి స్థాయి అంతర్జాతీయ ప్రమాణాల ఫుట్‌బాల్ మైదానం లేదని పేర్కొన్నారు. రాయచోటిలో ఇందుకోసం 24.90 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టవచ్చని వివరించారు. రాయచోటి, పరిసర ప్రాంతాల్లో ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో విశేష ప్రతిభ కలిగిన యువతకు ఈ క్రీడా సముదాయం ఎంతో ఉపయోగపడుతుందని, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంటూ, దీనికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## చోడవరంలో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య

**చోడవరం జూలై 29 జయ జయహే**



చోడవరం ద్వారకా నగర్‌లో విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. లక్కరాజు ప్రశాంత్ (23) అనే యువకుడు ఉరివేసుకుని మృతి చెందాడు.మృతుడి తల్లిదండ్రులు నాయుడు, లక్ష్మి కాగా, అన్నయ్య కుమార్ ఉన్నారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రన్ 5కే పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్నం, జూలై 29, జయ జయహే :**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించనున్న "భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్--5కే " కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ , కోచ్‌లు వి. దాస్, వైకుంఠ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతుందని, ఈ ఎయిర్‌పోర్ట్ ప్రాంతీయ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు, పర్యాటక రంగ విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు, అంతర్జాతీయ అనుసంధానానికి కీలకంగా మారనుందని అన్నారు. "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగే మహత్తర ప్రాజెక్టు భోగాపురం ఎయిర్‌పోర్ట్" అని ఆయన పేర్కొన్నారు. ఈ అభివృద్ధికి ప్రజలంతా భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో జూలై 31న ఉదయం 5:45 గంటలకు పార్క్ హోటల్ నుండి తేనేటి పార్క్ వరకు 5 కిలోమీటర్ల రన్ నిర్వహిస్తున్నామని, విశాఖపట్నం ప్రపంచ స్థాయి గ్లోబల్




గేట్‌వేగా ఎదుగుతున్న ఈ చారిత్రక సందర్భంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, అలాగే వయోపరిమితి కూడా లేదని తెలిపారు. పురుషులు, మహిళలు, విద్యార్థులు, యువత, క్రీడాకారులు, ఫిట్‌నెస్ అభిమానులు, అన్ని వయస్సుల వారు ఈ రన్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాధికారి జూన్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, శారీరక విద్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బయ్య

**శ్రీకాళహస్తి, జులై 29,జయ జయహే**

.శ్రీకాళహస్తి పట్టణం లో బుధవారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో రాష్ట్ర టిడిపి కార్యదర్శి మాసారపు.సుబ్బయ్యపాల్గొని కూటమి అభివృద్ధి ని వివరించారు. కార్యక్రమం లో సుజాత,చంద్రకళ, బాలసుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎస్సీ అక్రమాలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 29**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన "మావిగన్ ట్రాక్"లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడుస్తున్నారని, త్వరలో మచిలీపట్నాన్ని కూడా అమరావతి పరిధిలో చేర్చే పరిస్థితి వస్తుందని మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్ వ్యాఖ్యానించారు. బుధవారంవిఎల్‌పురంలోని మార్గాని ఎస్టేట్స్‌లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అమరావతి రాజధాని 29 గ్రామాలకే పరిమితం కాదని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, అయితే రాజధాని అభివృద్ధికి ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎంత నిధులు తెచ్చారో, ఎంత ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.జగన్ హయాంలో వచ్చిన ప్రాజెక్టులకు ఇప్పుడు చంద్రబాబు, నారా లోకేష్ క్రెడిట్ తీసుకుంటున్నారని, విశాఖ గూగుల్ సెంటర్ సహా అనేక ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని ఆరోపించారు. డేటా సెంటర్ ఒడిశాకు తరలిపోతుందనే ప్రచారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.డిఎస్సీ పరీక్షల్లో పేపర్ లీకేజీ, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. డిఎస్సీ అక్రమాలపై ప్రశ్నించినందుకు తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని, ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కేసులపై ప్రజా కోర్టులోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు.డిఎస్సీ అవకతవకలపై అన్ని ఆధారాలతో తనతో బహిరంగ చర్చకు రావాలని నారా లోకేష్‌కు సవాల్ విసిరారు. స్పోర్ట్స్ కోటా పేరుతో డీఎస్సీ ఉ ద్యోగాల విక్రయం జరిగిందని ఆరోపించారు.వైఎస్ జగన్ స్ఫూర్తితో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మూడోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు భరత్ తెలిపారు. ఆగస్టు 1న రాజమహేంద్రవరం మంజీరా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో 70 ప్రముఖ కంపెనీలు పాల్గొని 2 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నాయని, అర్హులైన అభ్యర్థులకు స్పాట్‌లోనే అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేస్తామని చెప్పారు. యువత ముందస్తుగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.మార్గాని నాగేశ్వరరావు, మార్తి లక్ష్మీ, మార్గాని సురేష్, అరె చిన్ని, కాటం రజనీకాంత్, బిల్డర్ చిన్నా, పీత రామకృష్ణ, వట్టికూటి కృష్ణవేణి, మజ్జి అప్పారావు, దాది గౌరీశంకర్, మార్తి నాగేశ్వరరావు, నంద కిషోర్, సంతోష్, అనంత లక్ష్మీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

**తిరుమల, జూలై 29,జయ జయహే.**

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం. కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.ముందుగా పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జీయంగారు శ్రీవారిని దర్శించుకున్న తరువాత పెద్దజీయంగారు కి మేల్‌చాట్ వస్త్రాన్ని,చిన్నజీయంగారు కి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం పెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం,పేష్కార్ రామ కృష్ణను సన్మానించారు.

## హరిత రసాయన పరిశోధనలతో

# పర్యావరణ పరిరక్షణ సాధ్యం

### యువ శాస్త్రవేత్తలు వినూత్న ఆవిష్కరణలకు ముందుకు రావాలి : డా. టి. రవి

### ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జాతీయ రసాయన శాస్త్ర సదస్సు ప్రారంభం.

**తిరుపతి,జూలై 29, జయ జయహే.**

తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "పర్యావరణ పరిరక్షణకు దోహదపడే స్థిరమైన రసాయన సమ్మేళనాల తయారీ అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ రసాయన శాస్త్ర సదస్సు బుధవారం కళాశాల సమావేశ మందిరంలో వైభవంగా ప్రారంభమైంది.కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో టీటీడీ సిపిఆర్వో డా. టి. రవి, ఎస్.పి.డబ్ల్యూ. డిగ్రీ ఒ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. నారాయణమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపిఆర్వో డా. టి.రవి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ నేటి ప్రపంచానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని పేర్కొన్నారు. హరిత రసాయన శాస్త్ర పరిశోధనలు ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు కాలుష్య నియంత్రణకు సమర్థవంతమైన మార్గాలని తెలిపారు. విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే దిశగా మలచాల్సిన బాధ్యత యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులపై ఉందన్నారు. విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే దిశగా మలచాల్సిన బాధ్యత యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులపై ఉందన్నారు. పర్యావరణ హిత సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సుస్థిరమైన ప్రపంచాన్ని అందించేందుకు విద్యార్థులు పరిశోధనా రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. విద్య, విజ్ఞానం, విలువలు సమన్వయంతోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

**పర్యావరణహిత ఔషధ తయారీపై కీలకోపన్యాసం**

ఢిల్లీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డా. పన్నూరు వెంకటేశు "ఔషధ తయారీలో పర్యావరణహిత ద్రావకాల వినియోగం -- ఔషధ సూత్రీకరణల్లో అయానిక్ ద్రవాలు, డీప్ యూటెక్టిక్ ద్రావకాల ప్రాధాన్యం" అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఔషధ తయారీలో పర్యావరణహిత ద్రావకాల వినియోగం వల్ల ఔషధాల ద్రావణీయత, స్థిరత్వం, జీవలభ్యత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా విశేషంగా దోహదపడుతుందని ఆయన వివరించారు.

**ఆధునిక పరిశోధనా ధోరణులపై నిపుణుల విశ్లేషణ**

అనంతరం ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ డా. రమేష్ గురుదాస్, ఐఐటీ తిరుపతికి చెందిన కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. సునీల్ కుమార్, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన రసాయన శాస్త్ర ప్రొఫెసర్ డా. ఏ. రాజ్ కుమార్ ఉపన్యాసాలు అందించి రసాయన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనా దిశలు, పారిశ్రామిక అనువర్తనాలు, హరిత సాంకేతికతలపై సమగ్రంగా వివరించారు.

దేశంలోని పలు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు చెందిన పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను మౌఖికంగా సమర్పించి శాస్త్రీయ చర్చల్లో పాల్గొన్నారు.

రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. పి.వి. చలపతి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ జాతీయ సదస్సులో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుళ్లిన కోడి గుడ్లు సరఫరా చేయకండి...!

### ఆ నెపాన్ని మధ్యాహ్న భోజన కార్మికులపై నెట్టేయకండి...!

### అధికారులను ప్రశ్నించిన మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి

**పాయకరావుపేట , జూలై 29, జయ జయహే :**



మధ్యాహ్న భోజనంలో గుడ్లు నాణ్యతపై ఉద్యోగులను తొలగిస్తే అవి బాగోవని...వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకుంటే మధ్యాహ్న భోజన నాణ్యత పెరుగుతుందని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాయకరావుపేట హైస్కూల్లో మధ్యాహ్న భోజన తనిఖీకి వచ్చిన కాపు కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టి బాబు కోడిగుడ్లు కంపు కొడుతున్నాయని ఆరోపిస్తూ అక్కడి మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడైపోయిన, వాసన వస్తున్నటువంటి కోడిగుడ్లను మధ్యాహ్న భోజన కార్మికులు పెడుతున్నారని, వాళ్ళని తొలగించాలని సిఫార్సు చేయడం సరికాదన్నారు. ఆ గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేస్తున్న విషయము అక్కడకు వచ్చిన అధికారులకి, ప్రజా ప్రతినిధులకి తెలియదా అని గూనూరు వరలక్ష్మి ప్రశ్నించారు. పురుగులు పట్టిన గుడ్లు, వాసన వస్తున్న గుడ్లు సరఫరా చేస్తున్నారని, అలాంటి గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం చేతకాక మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే నాణ్యత లేని సరుకులు వండి పెట్టడం తమ తప్పు ఎలా అవుతుందని, ప్రభుత్వం చేస్తున్న తప్పుకు మధ్యాహ్న భోజన కార్మికులను ఎలా బలి చేస్తారని, ఎలా తీసివేస్తారని ఆమె ప్రశ్నించారు. ముందు రోజు మిగిలిపోయిన గుడ్లను మరసటి రోజు పెడుతున్నారని చెప్పడం పూర్తిగా అవాస్తవమని, ఇది రాజకీయం చేయడం తప్ప మరొకటి కాదని, ఎంతమంది పిల్లలు తింటే అన్ని గుడ్లు అక్కడున్న ఉపాధ్యాయులు లెక్కించి ఇస్తారని, గుడ్లు ఎలా మిగులుతాయని ఆమె నిలదీశారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయకుండా, మధ్యాహ్న భోజన కార్మికులపై కాకుండా చేతనైతే స్కూల్ లకు గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించకుండా యధావిధిగా కొనసాగించాలని దీనిపై అధికారులు కూడా వాస్తవాలు అందరికీ తెలియజేయాలని కోరారు..



# భారీగా భోగాపురం ప్రారంభ సన్నాహాలు

### ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

**భోగాపురం, జూలై 29, జయ జయహే :**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు ఏర్పాట్లు మరింత వేగవంతం అయ్యాయి. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే ఈ ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ చారిత్రక ఘట్టానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో, పనులను మరింత వేగవంతం చేశారు. నోడల్ అధికారి ఎం టి కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి పర్యవేక్షణలో అధికార యంత్రాంగం, జిఎంఆర్ సంస్థ, ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ నిర్వహిస్తున్నాయి. ప్రధాని పాల్గొనే వేదిక ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. బహిరంగ సభలో జనం కూర్చోడానికి ఇప్పటికే భారీ జర్మన్ హ్యాంగెర్ల ఏర్పాటు పూర్తి అయ్యింది. సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు, సమీపంలోనే కంట్రోల్ రూమ్ ను బుధవారం ప్రారంభించారు. అలాగే వీఐపీ పార్కింగ్, సాధారణ వాహనాల పార్కింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టి, ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీజీ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ఎస్.కోటలో జనసేన పార్టీకి నూతనోత్సాహం

### కాంగ్రెస్, వైసీపీ నుంచి 45 మంది జనసేనలో చేరిక

### త్వరలో భారీ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు





**విశాఖపట్నం, జూలై 29, జయ జయహే**

దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలోకి బుధవారం భారీ చేరికలు జరిగాయి. ఎస్.కోట మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు భోగి రమణ తన అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. భోగి రమణకు జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు జడ్పిటిసి, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, ముఖ్య నేతలు, అనుచరులు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గౌరవ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషికి ఆకర్షితులై అనేకమంది జనసేన పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో జనసేన పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఎస్.కోట నియోజకవర్గం జనసేన పార్టీకి కంచుకోటగా మారుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నారని, సీనియర్ నాయకులు భోగి రమణ జనసేన పార్టీలో చేరడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.



## సంక్షేమం, అభివృద్ధి పై వివరిస్తున్న తెలుగు యువత

**పాడేరు (జయ జయహే)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ పాడేరు మండలం చింతలవీధి లో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజలకు అందుతున్న సంక్షేమశీ తల్లికివందనం, రైతు భరోసా, ఎన్ టీ ఆర్ పింఛను భరోసా, ఏడాదికి ఉచిత గ్యాస్, ఉద్యోగాలు నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చక్కగా నిర్వహిస్తుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ తామర మూర్తిబాబు, జగశీదొర చంటిబాబు, అప్పారావు, వంతల రమేష్,రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

**కె గంగవరం (జయ జయహే)**



కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన మకినీడి బ్రహ్మయ్య ,వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే భారీ ఎత్తున అన్నసమరాధన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎచ్చెర్ల పాఠశాలకు కంప్యూటర్ల విరాళం

**ఎచ్చెర్ల (జయ జయహే )**

జేసీఐ ఇండియా ప్రతిష్ఠాత్మక "సస్టైనబుల్ సొల్యూషన్స్ ప్రాజెక్ట్"లో భాగంగా, జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ఆధ్వర్యంలో కేజీబీవీ ఎచ్చెర్ల పాఠశాలకు 5 కంప్యూటర్ లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ఇన్ఫోసిస్ సంస్థ సహకారం అందించిందని, విద్యార్థుల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, భవిష్యత్తు అవకాశాలకు వారిని సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ కంప్యూటర్ల ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించి, తమ విద్యా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కంప్యూటర్లను జోన్ ప్రెసిడెంట్ జేఎఫ్ఆర్ చైతన్య వసంతవాడ, జోన్ వైస్ ప్రెసిడెంట్ జేసీ హెచ్‌జీఎఫ్ ఈశ్వర్ రావు, జోన్ డైరెక్టర్ జేఎఫ్ఎస్ భార్గవ మహర్షి, జోన్ డైరెక్టర్ జేఎఫ్ఎం ప్రవీణ్ కుమార్ సింగూరు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షురాలు జేసీ హెచ్జిఎఫ్ శర్మిల ముదిల మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడం ద్వారా సమాజాభివృద్ధికి జేసీఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులందరికీ, ఇన్ఫోసిస్ సంస్థకు, విచ్చేసిన అతిథులకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సెక్రెటరీ వెంకటేష్ ఐతం మాట్లాడుతూ డిజిటల్ విద్యతో విద్యార్థులను శక్తివంతం చేయడం, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం అనే లక్ష్యంతో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్, జోన్ కోఆర్డినేటర్ దూసి సంతోష్, అనిల్ కుమార్ కూన, వైస్ ప్రెసిడెంట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సీపాన జోష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ సూర్య కళ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**శింగనమల. (జయ జయహే )**




గురుపూర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ షిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

For a pure tomorrow.. జయహే

# విద్యుత్ వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**అనకాపల్లి జయ జయహే**



విద్యుత్ వినియోగదాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని కోరుతూ ఏపీ ఈపీడీసీఎల్ డిపార్ట్మెంట్ ఈ ఈ ఎస్ రామకృష్ణ ను యంగ్ స్టూడెంట్స్ క్లబ్ మరియు జగన్నాథ స్వామి ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ దాడి ఈశ్వర రావు కలిసి ఆయనకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తరచుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతున్నదని అధిక విద్యుత్ బిల్లులు ట్రాన్స్ఫారం సమస్యలు విద్యుత్తు అధిక లోడు రావడం వంటి పలు సమస్యలు విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు అధికారులు ఎవరు ఫిర్యాదు ఇచ్చిన పట్టించుకోవడంలేదని వాటి పరిష్కారం కూడా చూపటం లేదని అంటూ వారు అధికారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది విద్యుత్ శాఖ దిగు స్థాయి అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది తమ నిర్లక్ష్యాలను వీడి వినియోగ దారులకు విద్యుత్తు సంబంధించిన సేవలు సకాలంలో అందించాలని విద్యుత్ సరఫరాల అంతరాయం లేకుండా చూడాలని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్తు సరఫరా నిలిపివేయకూడదని అలాగే హై వోల్టేజ్ హెచ్చుతగ్గులు వల్ల విలువైన గృహపాకరణాలు పాడైపోయి తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు విద్యుత్తు మీటర్ల లో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని వాటిని సరిచేసే ప్రక్రియ కూడా చేపట్టడం లేదని మీటర్ రీడింగ్ విద్యుత్తు బిల్లులు సకాలంలో రీడింగ్ తీయకుండా తమకు నచ్చిన టైంలో తీసి బిల్లులు వినియోగదారులకు అందిస్తున్నారని దీనివలన వినియోగదారులకు అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వాటిపై ప్రశ్నిస్తే వారు వినియోగ దారులతో వాగివాదం దిగుతున్నారని, ఇలాంటి వివాదాలపై విద్యుత్ శాఖ ఆఫీసుకు వస్తే అక్కడ కూడా వారికి సరైన స్పందన రావడంలేదని నిర్లక్ష్యం చూపిస్తున్నారని కొందరికి అయితే బిల్లు సరి చేస్తామని చెప్పి నాలుగైదు సార్లు ఆఫీసు చుట్టూ తిప్పుకొని బిల్లు కట్టే ఆఖరి తేదీ వరకు ఇదే విధంగా చేసి ఇంకా మేము ఏమి చేయలేము చెప్పి బిల్లు కట్టేసుకోండి చివరి టైం లో చెబుతున్నారు దీని గురించి ఎవరైనా గట్టిగా మాట్లాడితే మీకు నచ్చింది చేసుకోండని కూడా సమాధానం చెబుతున్నారు ఇది ఇలా వినియోగదారులతో మాట్లాడే విధానమా అని ఆయన ప్రశ్నించారు. కొత్త కనెక్షన్ ఇవ్వడం అదనపు లోడు మంజూరు చేయడం లోను తీవ్ర జాప్యం జరుగుతున్నదని కొందరు దరఖాస్తులను ఎటువంటి కారణాలు లేకుండా తిరస్కరిస్తున్నారని ప్రజలతో మమేకమై పనిచేయవలసిన అధికారులు ఎక్కడ ఆ విధానం కనబడటం లేదని అన్ని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఓవర్ లోడ్ పడటం వల్ల తరచూ కాలిపోతున్నాయని వాటిని సరి చేయడం లేదా వేరే చోటకు తరలించే క్రమంలో విద్యుత్ వినియోగదారులను ఇబ్బంది పాలు చేస్తున్నారని దాడి ఈశ్వరరావు ఆరోపించారు క్యాటగిరి మార్పు గృహ అవసరాల నుండి వాణిజ్య అవసరాలకు లేద వాణిజ్యం నుంచి గృహ అవసరాలకు కేటగిరి మార్చే సేవలోను తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నదని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతను అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు అర్థం చేసుకొని క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేయాలని వినియోగదారులతో సహృదభావంతో మెలగాలని వారి సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు




## శ్రీకృష్ణ దేవాలయంలో ఘనంగా జరిగిన గురుపౌర్ణమి వేడుకలు

**అనకాపల్లి జయ జయహే**

గురు పౌర్ణమి సందర్భంగా 84 వ వార్డు గొల్ల వీధిలో శ్రీకృష్ణ దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు బోడి వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ పాల్గొని సాయి బాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించి అనంతరం అక్కడ పాలకవర్గ సభ్యులు ఆయనకు దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. అక్కడ విచ్చేసిన భక్తుల ఉద్దేశించి నాగ జగదీష్ మాట్లాడుతూ ఆషాడ శుద్ధ పౌర్ణమి గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అంటారని ఈ పవిత్రమైన రోజున మనకు జ్ఞానాన్ని అందించిన మనకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకునే రోజు అని వారిని గౌరవించుకునే రోజు అని అలాగే ఈ రోజు వేద వ్యాసుని జన్మదినం కూడా అని పేర్కొన్నారు ఈ సమావేశానంతరం అక్కడ దేవాలయం లో ఏర్పాటు చేసిన భక్తుల అన్న సమారాధన ఆయన ప్రారంభించి భక్తులకు అన్నదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కుప్పిలి జగన్,బొబ్బిలి గోవిందరాజు, నమ్మి రామారావు, నమ్మి దేవుడమ్మ,బోడి ఉమా తదితరులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇస్తున్న నూకాంబిక అమ్మవారు


**అనకాపల్లి జయ జయహే**



ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆషాడ మాసం గురు పౌర్ణమి సందర్భంగా నోకాంబిక అమ్మవారిని శాఖాంబరి అమ్మవారిగా పలు కాయ గూరులతో ఆకుకూరలతో మరియు వివిధ రకాల ఫ్రూట్స్ తో అమ్మవారిని అలంకరించడం జరిగింది భక్తులు శాఖాంబరి అమ్మవారిని చూచేందుకు చుట్టుపక్కల మహిళలు దూర ప్రాంతా ల నుండి వచ్చిన భక్తులు శాకంబరీ అలంకారంలో ఉన్న నోకాంబిక అమ్మవారిని దర్శించి భక్తులు తన్మయత్వాన్ని పొందారు అలాగే దేవాలయ ప్రాంగణంలో భారీ నిర్వహించారు ఈ నెల ఆగస్టు ఒకటవ తేదీన భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా దానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా విజయవంతంగా ప్రారంభోత్సవం జరగాలని ఏర్పాటు అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సూచన మేరకు స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం నూకాంబికా దేవస్థానంలో లక్ష్మీ గణపతి హోమం సంకట విమోచన హోమం మరి రాష్ట్రంలో వర్షాలు బాగా పడి పాడిపంటలు అభివృద్ధి చెందాలని ప్రజలందరూ సుఖశాంతులతో రాష్ట్రం సుభిక్షంగా ఉ ండాలని కోరుతూ ఈ హోమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పి నాగ శ్రీను( గొల్ల బాబు ) ఆలయ సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కొడుకుల శ్రీకాంత్ దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ మారిశెట్టి శంకర్రావు కాండ్రేగుల రాజారావు మజ్జి జానకి శ్రీనివాసరావు వద్దాది మంగ కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు ఎర్రవరపు సంతోషి కుమారి నాగేష్ దేవాలయ అర్చకులు సందీప్ శర్మ, వాసు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కాణిపాకం మణికంఠేశ్వర స్వామికి విశేష అలంకరణ

**పూతలపట్టు,జూలై 29,జయ జయహే.**



కాణిపాకం అనుబంధ దేవాలయమైన శాకాంబరి దేవి ఉత్సవాల భాగంగా బుధవారంమణికంఠేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కూరగాయలతో అలంకరణ చేశారు. ప్రధాన దేవాలయం బుధవారం ఆషాడ పౌర్ణమి పురస్కరించుకుని శాకంబరీ దేవి ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల కూరగాయలు వివిధ రకాల పండ్లుతో ప్రధాన దేవాలయము మణికంఠేశ్వర స్వామి వారి ఆలయాల్లో వైభవంగా అలంకరణలు నిర్వహించడం జరిగింది, సుమారు మొత్తం 15 టన్నుల కూరగాయలను పలమనేరు, వడ్డిపల్లి, కోలార్, ముల్బాగల్, హోసూర్, మార్కెట్ చెందిన వ్యాపారులు రైతులు వారు రవీంద్ర రెడ్డి వారి మిత్రబృందం విరాళంగా అందజేశారు, వీరికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు శేషవస్త్రం అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు ఈ.వో శ్రీ పెంచల కిషోర్ గారు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శివప్రసాద్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.




## భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవం విజయవంతం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అనకాపల్లి రింగ్ రోడ్ లో గల పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్లమెంటరీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు అధ్యక్షతన జగన్ పార్లమెంటు కమిటీ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మరియు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు పాల్గొని ఆగస్టు ఒకటో తేదీన అల్లూరి సీతారామరాజు నూతన విమానాశ్రయం విజయనగరం జిల్లా భోగాపురంలో జరుగు ప్రారంభోత్సవం కి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటున్నారని ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొనడం జరిగింది



## శ్రీ వరలక్ష్మి సిల్క్సను ప్రారంభించిన వర్ష

**శ్రీకాళహస్తి, జులై 29,జయ జయహే**


పట్టణంలోని నెహ్రూ వీధిలో నూతనంగా ప్రారంభించిన శ్రీ వరలక్ష్మి స్టిల్క్స షోరూం ను జబర్దస్త్ వర్ష ప్రారంభించారు.ఆమెకి వరలక్ష్మి స్టాప్ స్వాగతం పలికారు. అభిమానులతో డాన్స్ వేసి సందడి చేసింది. మీడియాతో ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో వరలక్ష్మీ సిల్క్స పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం కు రావటం చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న సినీ గాయని గీతామాధురి

**శ్రీకాళహస్తి, జులై 29,జయ జయహే.**


సినీ గాయని గీతామాధురి దంపతులు బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు.స్వామి అమ్మవార్ల దర్శనంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వచనం పలికారు అధికారులు జ్ఞాపికను బహుకరించారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవం

**చోడవరం జూలై 29 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం "కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ అధ్యక్షత వహించి బిఏ బీకాం బీఎస్సీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 2010 రష్యాలో జరిగిన అంతర్జాతీయ పులుల శిఖరాగ్ర సమావేశంలో అంతర్జాతీయంగా పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం గురించి, వాటి సంఖ్య పెంపొందించడం గురించి చర్చించారన్నారు. అలాగే వన్యప్రాణులు అటవీ ప్రాంత పరిరక్షణ గురించి, అటవీ ప్రాంతాలు, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల గురించి, ప్రాజెక్టు టైగర్ 1973 చట్టాల గురించి వివరించారు. జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలు జగ్గు మంత్రి షర్మిల శ్రీ మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతర్జాతీయ పులుల దినోత్సవం థీమ్-2026 "కమ్యూనిటీ లెడ్ కన్జర్వేషన్" గురించి వివరించారు. పులులు వాటి ఆవాస ప్రకృతి మానవాళి బాధ్యత, స్థానిక ప్రజల సహకారముతో పులుల పరిరక్షణలో అటవీ ప్రాంత పరిరక్షణ చట్టాల గురించి పి పి టి ద్వారా విద్యార్థులకు తెలియపరిచారు. ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎం రాజేశ్వరరావు, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ మల్లిబాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ బి పిచ్చమ్మ, డి మాల్యాద్రి, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ నారాయణ, రామలక్ష్మి, కోమల, హేమ గణేష్ ఇతర అధ్యాపక బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సత్య సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు

**మాడుగుల జూలై 29 జయ జయహే**

గురు పౌర్ణమి సందర్భంగా మాడుగుల మోదమాంబ కాలనీలో గల శ్రీ సత్య సాయి మందిరంలో బుధవారం తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నామ సంకీర్తన చేపట్టారు. సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.




## రైతులంతా పి ఎం ఎఫ్ బి వై పథకాన్ని సద్వినియోగపరుచుకోండి

**మాడుగుల జూలై 29 జయ జయహే**

రైతులంతా పి ఎం ఎఫ్ బి వై పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారిని అనసూయ విజ్ఞప్తి చేశారు. పొలంపిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా బుధవారం ఆమె జమ్మదేవిపేట కింతలీవల్లాపురం గ్రామాలలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వరి నారుమడి లో జింక్ దాతు లోపము ఉన్నపుడు 10 గ్రాముల జింక్ సల్ఫేట్ ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా సవరించుకోవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా క్షేత్ర సందర్శన చేసి రైతులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో పాల్గ టీడీపీ క్లస్టర్ సహాయకులు వి రాజ్ కుమార్ , గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



## శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన వాసవి మాత

**మాడుగుల జూలై 29 జయ జయహే**

మాడుగుల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు పళ్ళు, కూరగాయలతో అలంకరించారు. ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వాసవి వన్నిదలచే పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com